ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



పెద్దపల్లి

జిల్లా వార్తలు

5★

మంగళవారం 12 ఆగస్టు 2025

ప్రజావాణి అర్జీలను సత్వరమే పరిష్కరించాలి



దరఖాస్తులను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీహర్ష

పెద్దపల్లిటౌన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) ప్రజావాణి అర్జీలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమం సందర్భంగా కలెక్టరేట్‌లో ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు. రామగిరి మండలం ముస్త్యాల గ్రామానికి చెందిన ఆవునూరి పద్మ ఇందిరమ్మ ఇండ్లు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా పీడీ హౌసింగ్‌కు రాశారు. పెద్దపల్లి పట్టణానికి చెందిన సామాజిక కార్యకర్త రామన్ కలెక్టరేట్ సమీపంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు జరుగుతున్నాయని వీటిని నియంత్రించేందుకు చర్యలు తీసుకోవాలని దరఖాస్తు చేసుకోగా మున్సిపల్ కమిషనర్‌కు రాశారు. పాలకుర్తి మండలం నిట్టూరు గ్రామానికి చెందిన రామ్మోహన్‌రావు సర్వే నెంబర్ 503 లోని ప్రభుత్వ భూమిలో ఆక్రమించారని దీనిపై చర్యలు తీసుకోవాలని దరఖాస్తు చేసుకోగా ఆర్డీవోకు రాస్తూ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. సంబంధిత జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

రైతు బీమాకు మార్గం సుగమం



- రెన్యూవల్ చేసేందుకు ఉత్తర్వులు జారీ
- రేపటి వరకు కొత్త వారికి దరఖాస్తు చేసేందుకు అవకాశం
- జిల్లాలో 5,951 మంది కొత్త పట్టాదారులు

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

రైతు బీమా పథకాన్ని కొనసాగించేందుకు మార్గం సుగమమైంది. ఈ నెల 14వ తేదీతో రైతుల బీమా గడువు ముగియనుండగా, అర్హులైన వారికి రెన్యూవల్ చేయాలని, కొత్త పట్టాదారుల నుంచి ఈ నెల 13వ తేదీ లోపు దరఖాస్తులను అప్‌లోడ్ చేయాలని రాష్ట్ర వ్యవ సాయ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో వ్యవ సాయ శాఖ మండల ఏఓలు, విస్తీర్ణాధికారులు కొత్త రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించి అప్‌లోడ్ చేస్తు న్నారు. నెల రోజులుగా ఈ పథకానికి సంబంధించి ప్రభుత్వం ఎలాంటి ఉత్తర్వులు జారీ చేయక పోవడంతో రైతు బీమా పథకాన్ని కొనసాగిస్తారా, లేదా అనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. పథకం కొన సాగింపునకు ఈ నెల 9న ఉత్తర్వులు జారీ కావడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. 2018 అసెంబ్లీ ఎన్ని కలకు ముందు అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం రైతు బంధు పథకాన్ని తీసుకవచ్చింది. పట్టాలు కలిగిన రైతులందరికి ఎకరానికి 4 వేల చొప్పున, ఆ తర్వాత 5 వేల రూపాయల చొప్పున ఇచ్చింది. అదే సమయంలో రైతుల కోసం రైతు బీమా పథకాన్ని తీసుక వచ్చింది. రైతులు ప్రమాదవశాత్తు మృతి చెందినా, అనారోగ్య కారణాల వల్ల, ఇతరత్రా కారణాల వల్ల బలవన్మరణా లకు పాల్పడి మృతి చెందే రైతుల కుటుంబాలు బజారున పడకుండా ఉండేందుకు రైతు బీమా పథకాన్ని తీసుక వచ్చింది. రైతులు మరణిస్తే 5 లక్షల రూపాయలు ఇచ్చే విధంగా పథకాన్ని రూపొందించారు. భారత బీమా సంస్థ (ఎల్ఐసీ)తో ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకున్నది. ఈ పథకం కింద ప్రభుత్వమే నేరుగా ప్రీమియం మొత్తం ఎల్ఐసీ సంస్థకు నేరుగా చెల్లిస్తు న్నది. యేటా ఆగస్టు 15వ తేదీ నుంచి ఆ తర్వాత ఏడాది ఆగస్టు 14వ తేదీ

(మిగతా 8వ పేజీలో)

● కొత్త పట్టాదారులు 5,951 మంది రైతులు..

గత జూన్ 5 తర్వాత నుంచి ఈ ఏడాది జూన్ 4వ తేదీ వరకు కొత్తగా పట్టాదారు పాసుపుస్తకాలు కలిగిన రైతులు 5,951 మంది ఉన్నారు. ఇందులో పాలకుర్తి మండలంలో 345 మంది, ఓదెలలో 547, కాల్వశ్రీరాం పూర్‌లో 450, జూలపల్లిలో 387, కమాన్‌పూర్‌లో 231, ముత్తారంలో 233, ధర్మారం మండలంలో 539 మంది రైతులు ఉన్నారు. సుల్తానాబాద్ మండలంలో 504 మంది, ఎలిగేడులో 284, అంతర్గాంలో 210, రామగిరి లో 383, పెద్దపల్లిలో 1185, మంథనిలో 550, రామగుం డంలో 100 మంది రైతులు ఉన్నారు. కొత్త రైతుల డేటా అంతా వ్యవసాయ విస్తీర్ణాధికారుల వద్ద ఉంది.

యూరియా కోసం రైతుల పాట్లు



కూనారం పీఏసీఎస్ ఎదుట రైతుల క్యూ

కాల్వశ్రీరాంపూర్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): యూరియా కోసం రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కూనారంలో సోమవారం యూరియా కొరతతో రైతులు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయం ఎదుట బారులు తీరారు. ప్రాథమిక సహకార సంఘానికి ఒక లోడు యూరియా రావడంతో రైతులు ఒక్కసారిగా ఎగబడటంతో కాసేపు తోపులాట చోటు చేసుకుంది. నాలుగు రోజుల నుంచి యూరియా కోసం పడిగాపులు కాస్తు న్నామని, ఇవ్వడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. రెండు బస్తాలు మాత్రమే ఇవ్వడంతో అవి సరిపోవడం లేదని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రైతులకు సరిపడా యూరియా అందించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

పాలకుర్తి, (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతులకు యూరియా గోస తప్పడం లేదు. సోమవారం మేడిపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో కుక్కలగూడూర్‌లో ఎకరాకు ఒకటి చొప్పున 270 యూరియా సంచులను అప్పగించారు. డీసీఎంఎస్ ఆధ్వర్యంలో పుట్నూర్‌లో 270 సంచులు, కన్నాల ప్రాథమిక సహకార సంఘంలో 148 మంది రైతులు 367 యూరియా సంచులను అందించినట్లు నిర్వాహకులు తెలిపారు. సమయానికి యూరియా ఇవ్వడం లేదని రైతులు వాపోయారు. రైతులకు సరిపడ యూరియా అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని, అందుకు అనుగుణంగా యూరియాను అందుబాటులో ఉంచేందుకు ప్రయత్నిస్తున్నామని మండల వ్యవసాయ అధికారి బండి ప్రమోద్ కుమార్ తెలిపారు.

ఆర్ఎఫ్‌సీఎల్ నుంచి ఉమ్మడి జిల్లాకు 6వేల టన్నుల యూరియా

- చొరవ చూపిన కలెక్టర్
- ఐదు రోజుల్లో మూడు విడుతలుగా రవాణా...
- యూరియా కొరత వేళ యుద్ధ ప్రాతిపదికన సరఫరా

7

ఆల్బెండజోల్ మాత్రలతో నులి పురుగుల నివారణ



ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న జిల్లా వైద్యాధికారి అన్నప్రసన్నకుమారి

పెద్దపల్లి కల్చరల్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): నులిపురుగుల నివారణకు ప్రతీ ఒక్కరు సహకరించాలని జిల్లా వైద్యాధికారి అన్నప్రసన్న కుమారి తెలిపారు. సోమవారం జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని జడ్పీ ఉన్నత బాలికల పాఠశాలలో విద్యార్థులకు నులి పురుగుల నివారణ మాత్రలు వేశారు. ఆమె మాట్లాడుతూ పిల్లల్లో నులిపురుగులతో శారీరక, మానసిక ఎదుగుదల మందగిస్తుందన్నారు. తల్లిదండ్రులు పిల్లల శుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. గోర్లు పెరగకుండా కత్తిరించాలని, భోజనానికి ముందు శుభ్రంగా చేతులు కడుక్కోవాలని, మలమూత్ర విసర్జన అనంతరం చేతులు శుభ్రం చేసుకునే విధానం నేర్పించాలన్నారు. వీటి వల్ల రక్తహీనత, మతిమరుపు లాంటి లక్షణాలు ఉంటాయన్నారు. తినే ఆహారాలపై మూతలు ఉంచాలని, రోడ్ల వెంట అపరిశుభ్రమైన పదార్థాలు తినకూడదని తెలిపారు. అల్బెండజోల్ మాత్రలు వేయడం వల్ల రక్తహీనతను నివారించవచ్చని తెలిపారు. 706 అంగన్‌వాడీ కేంద్రాలలో ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలు 541, ప్రైవేటు పాఠశాలలు 161, ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలు 56 ఉండగా, మొత్తం 1,97,070 లక్షల మాత్రలను పంపిణీ చేశామన్నారు. మొదటి రోజు 1 నుంచి 19 ఏళ్ల పిల్లలకు 1,75,736 పంపిణీ చేసినట్లు వివరించారు. ప్రోగ్రాం ఆఫీసర్ కిరణ్ కుమార్, ప్రధానోపాధ్యాయులు అరుణ, వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

రైతుల ఆర్థిక బలోపేతానికి పటిష్ట చర్యలు



సోలార్ పవర్ ప్లాంట్‌కు శంకుస్థాపన చేస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

మంథనిరూరల్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): రైతులను బలోపేతం చేసే దిశగా సంక్షేమ కార్యక్రమాల అమలుతోపాటు అనుబంధ రంగాల అభివృద్ధికి పటిష్ట చర్యలు చేపట్టామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీదర్‌బాబు కోరారు. సోమవారం కలెక్టర్ కోయ శ్రీహర్ష, కరీంనగర్ డీసీసీబీ ఛైర్మన్ రవీందర్ రావుతో కలిసి మంత్రి శ్రీదర్‌బాబు చిల్లపల్లిలో రాష్ట్ర వేర్ హౌజింగ్ కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో రూ.7 కోట్లతో 5 ఎకరాల స్థలంలో నిర్మిస్తున్న రెండు గోదాంలకు, గుంజపడుగులో రూ.2.90 కోట్లతో పీఎం కుసుమ్ ప్యాక్స్ ఏర్పాటు చేసే సోలార్ పవర్ ప్లాంట్‌కు శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన గ్రీన్ ఎనర్జీ పాలసీలో భాగంగా జిల్లాలో నందిమేడారం, కాల్వశ్రీరాంపూర్, అప్పన్నపేట, మంథని ప్రాంతంలో 1 మెగావాట్ చొప్పున ప్లాంట్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. 4 నెలల కాలంలో విద్యుత్ ప్లాంట్ నిర్మాణ పనులు, గ్రిడ్ పనులు పూర్తి చేయాలన్నారు. చిల్లపల్లిలో 10వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం ఉన్న గోదాంలను రూ.7కోట్లతో చేపట్టామన్నారు. గుంజపడుగులో సహకారబ్యాంక్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాలని సూచించారు. రైతు సంక్షేమ కార్యక్రమాల తోపాటు అనుబంధరం గాలైన గోదాంల నిర్మాణం, పీఏసీఎస్ ద్వారా సోలార్ విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్ ఏర్పాటుతో రైతులను బలోపేతం చేస్తామన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అన్నయ్యగౌడ్, పీఏసీఎస్ చైర్మన్ కొత్త శ్రీనివాస్, ఏఎంసీ కుడుదుల వెంకన్న, ఆర్డీవో సురేష్, అధికారులు పాల్గొన్నారు.

సహకార బ్యాంక్ ప్రారంభం

కమాన్‌పూర్, (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమానికి సహకార బ్యాంకులు ఉపయోగపడాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. సోమవారం రూ.65 లక్షలతో నిర్మించిన ప్రాథమిక సహకార సంఘం భవనంతోపాటు రూ.79 లక్షలతో నిర్మించిన జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ బ్రాంచ్ భవనాన్ని కరీంనగర్ డీసీసీబీ చైర్మన్ రవీందర్‌రావు, కలెక్టర్ కోయ శ్రీహర్షతో కలిసి ప్రారంభించారు. మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వంలో రైతుల సంక్షే మానికి చర్యలు చేపట్టామన్నారు. జిల్లా సహకార కేంద్రం బ్యాంక్‌లో డిపాజిటర్లకు, కస్టమర్లకు అన్ని రకాల సౌకర్యాలు ఉండేలా నిర్మించినట్లు తెలిపారు. పేద ప్రజలకు ప్రభుత్వం అందించే సంక్షేమ కార్యక్రమాలను వారికి చేర్చేందుకు బ్యాంకులు ఉపయో గపడుతాయని తెలిపారు. రైతులకు అందుబాటులో ఉండేలా మండలకేంద్రంలో సహకార బ్యాంక్ బ్రాంచ్ ఏర్పాటు చేశామని తెలిపారు. కరీంనగర్ డీసీసీబీ చైర్మన్ రవీందర్‌రావు మాట్లాడుతూ మండలంలో ప్రాథమిక వ్యవసాయ సహకారసంఘం, సహకారబ్యాంక్ భవనాన్ని ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. కేంద్ర సహకార బ్యాంకుల్లో 72శాఖలు ఉంటే 32భవనాలు నిర్మించుకున్నామన్నారు. సహకార సొసైటీద్వారా కూడా భవనాలు బ్యాంకుకు అద్దె ఇస్తున్నామన్నారు. గతంలో 70 కోట్ల నష్టం, రూ.400 కోట్ల వ్యాపారంతో ఉన్న సహకార బ్యాంకును నేడు 7200కోట్ల వ్యాపారం, రూ.120కోట్ల లాభాలతో నడిచేలా అభివృద్ధి చేశామన్నారు. యేటా కస్టమర్లకు, వాటాదారులకు బోనస్ అందిస్తున్నామని అన్నారు. ఆర్డీవో సురేష్, తహసీ ల్దార్, ఎంపీడీఓ నాయకులు పాల్గొన్నారు.



సహకార బ్యాంకుకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

దశల వారీగా రహదారుల అభివృద్ధి



రహదారి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

సుల్తానాబాద్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): దశల వారీగా గ్రామీణ రోడ్ల అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. సోమవారం కదంబాపూర్‌లో కోటి యాభై లక్షలతో చేపట్టనున్న బీటీ రోడ్డు పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రోడ్డు పనులను నెలన్నర రోజులలో పూర్తవుతాయని చెప్పారు. వివేకానంద విగ్రహంనుంచి రాజీవ్‌నగర్ నుంచి కనుకుల-కాల్వశ్రీరాంపూర్ చౌరస్తా వరకు బీటీ రోడ్డు పనులకు ఉత్తర్వులు వచ్చాయని, సాంకేతిక అనుమతులు రాగానే టెండర్లను పిలుస్తామన్నారు. గత ప్రభుత్వ హయాంలో మానేరు నుంచి ఇసుకను లారీలలో తరలించి రోడ్లను ధ్వంసం చేశారన్నారు. రైతులు అదనపు ట్రాన్స్‌ఫార్మర్‌కోసం కోరగా ఎస్ఈతో మాట్లాడి రైతుల సమస్య పరిష్కరించారు. ఈనెల15 వరకు ఎస్సారెస్పీ నీరు జిల్లాకు చేరుకుంటాయని ఎమ్మెల్యే అన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అన్నయ్యగౌడ్, కేడీసీసీబీ డైరక్టర్ శ్రీగిరి శ్రీని వాస్, పన్నాలరాములు, మాజీ సర్పంచ్ కోడెం అజయ్, సురేష్‌రెడ్డి, మార్కెట్ డైరెక్టర్లు శ్రీనివాస్‌గౌడ్, తిరుమల, నాయకులు దామోదర్‌రావు, సతీష్, కడారి సునిల్, అమర్, కొమురయ్య, రమేష్, పాల్గొన్నారు.

ఇందిరమ్మ నిర్మాణాలు ప్రారంభించాలి

ఎలిగేడు, (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు ఇంటి నిర్మాణాలను త్వరగా ప్రారంభించాలని ఎమ్మెల్యే అన్నారు. శివపల్లి ఆయన నివాసంలో హౌసింగ్ శాఖ పిడి రాజేశ్వర్, డీఈలు, ఏఈలు, పలు వురు అధికారులతోపాటు ఎంపీడీఓలు దివ్య దర్శన్, శ్రీనివాస్, పద్మజ, పూర్ణచందర్, తిరుపతి, భాస్కర్‌లతో సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో మంజూరు చేసిన ఇళ్ల నిర్మాణాల పురోగతిని తెలుసుకున్నారు. అధికారులు పర్యవేక్షించాలన్నారు.

ప్రధాని నరేంద్ర మోదీ దిష్టిబొమ్మ దహనం



ప్రధాని మోదీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

గోదావరిఖని, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): ఢిల్లీలోని ఎన్నికల కమిషన్ కార్యాలయ ముట్టడికి వెళుతున్న కాంగ్రెస్ నాయకుడు రాహుల్‌గాంధీని పోలీసులు అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ సోమవారం రాత్రి కాంగ్రెస్ నగర అధ్యక్షుడు బొంతల రాజేష్ ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ పాల్గొన్నారు. కాంగ్రెస్ నగర అధ్యక్షుడు బొంతల రాజేష్ మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం కర్ణాటక, బీహార్, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్రల్లో దొంగ ఓటర్లను నమోదు చేయడాన్ని నిరసిస్తూ ఎలక్షన్ కార్యాలయాన్ని ముట్టడించడానికి వెళుతున్న రాహుల్‌గాంధీ, ప్రియంక గాంధీలను అరెస్టును ఖండించారు. దేశంలో దొంగ ఓట్లతో గద్దెనెక్కిన బీజేపీ సర్కార్‌కు ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. మహంకాళి స్వామి, పాతపెల్లి ఎల్లయ్య, ముస్తాఫా, కొప్పుల శంకర్, గుండేటి రాజేష్, గట్ల రమేష్, ఫజల్‌బేగ్, దూళికట్ట సతీష్, ఉదయ్‌రాజ్, శంకర్, అనుమ సత్యనారాయణ, పంజా శ్రీనివాస్ పాల్గొన్నారు.

మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలి



మెడికల్ కళాశాల నిరసన తెలుపుతున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

కళ్యాణ్‌నగర్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): సింగరేణి ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ (సిమ్స్) ప్రిన్సిపాల్‌ను విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వ ర్యంలో సోమవారం మెడికల్ కళాశాల ఎదుట ధర్నా నిర్వహించారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రేణికుంట్ల ప్రీతం మాట్లాడు తూ మూడు రోజులు మాత్రమే కళాశాలలో ఉంటూ మిగతారోజులు హైదరాబాద్‌లో ఉం టున్నారని, ఇక్కడి విద్యార్థుల చదువును గాలి కి వదిలేశారని ఆరోపించారు. విద్యార్థుల సమస్యలను పట్టించుకోవడం లేదని, మెడికల్ కళాశాలలో ప్రొఫెసర్లులేక విద్యార్థులు ఇబ్బం దులు పడుతున్నారన్నారు. ప్రిన్సిపాలే గైర్హాజ ర్ అయితే వారికి ఎలా చదువు వస్తుందని ప్రశ్నించారు. ఆసుపత్రిలో పనిచేసే దళితు లపై కక్ష పూరితంగా వ్యవహరిస్తూ వారిని విధుల్లో నుంచి తొలగిస్తుందని, జనరల్ ఆసు పత్రిలో ప్రిన్సిపాల్ జోక్యం పెరిగిపోవడంతో అక్కడ పనిచేస్తున్న సిబ్బంది కూడా ఇబ్బం దులు ఎదుర్కొంటున్నారన్నారు. ఆసుపత్రిలో అకారణంగా తొలగించిన వారిని తీసుకోకుం డా ఇబ్బందులకు గురి చేస్తుందని, కలెక్టర్ ఆదేశాలు ఇచ్చినప్పటికీ వారిని విధుల్లోకి తీసుకోకుండా వేధింపులకు గురి చేస్తుందని ఆరోపించారు. ప్రిన్సిపాల్ వ్యవహార శైలిపై డీఎంఈకి ఫిర్యాదు చేస్తామని, కలెక్టర్‌ను కలుస్తామన్నారు. ప్రణీత్, సాయిచరణ్, సృజ న్, సాయి, సురేష్ పాల్గొన్నారు.

శ్రీపాద ఎల్లంపల్లిలో 13.132 టీఎంసీలు

పెద్దపల్లి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 20.175 టీఎంసీలు కాగా, సోమవారం సాయంత్రం వరకు 13.132 టీఎంసీలకు చేరుకున్నది. ఎగువ ప్రాంతం నుంచి 6,635 క్యూ సెక్కుల వరదనీరు వస్తున్నది. ఇక్కడి నుంచి హైదారాబాద్ తాగునీటి అవసరాలకు, ఎన్టీపీ సీకి 441 క్యూసెక్కుల నీటిని వదిలి పెడుతున్నారు. ఈ ఏడాది జిల్లాలో గానీ, ప్రాజెక్టు ఎగువ ప్రాంతంలో గానీ భారీ వర్షాలు నమో దు కాకపోవడంతో ప్రాజెక్టు నిండడం లేదు. గత ఏడాది జూలై 27న ప్రాజెక్టుకు భారీగా వరద నీరు రావడంతో ఎత్తిపోతలు షురూ చేశారు. కానీ ఈ ఏడాది పరిస్థితి దయనీ యంగా మారింది.

గంజాయి రవాణా చేస్తే కఠిన చర్యలు



నిందితులను అరెస్టు చూపుతూ మాట్లాడుతున్న ఏసీపీ రమేష్

మంథని, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): గోదారిఖని పోలీసు సబ్ డివిజన్ పరిధిలో అక్రమ సంపాదన, జల్సాల కోసం గంజాయి రవాణా, క్రయ, విక్రయాలు జరిపే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఏసీపీ మడత రమేష్ హెచ్చరించారు. ఎక్లాస్‌పూర్ శివారులోని గాడుదులగండి గుట్ట సమీపంలో గంజాయి రవాణా చేస్తూ పట్టుబడిన మంథనిలోని పోచమ్మవాడకు చెందిన బండారి అభిషేక్ అలియాస్ అంజీ, సూరయ్యపల్లి గ్రామానికిచెందిన కోరవేన రవిసాగర్, ఖానాపూర్ గ్రామానికి చెందిన పుట్ట అలియాస్ కొవ్వూరి అజయ్‌కుమార్‌లను సీఐ కార్యాలయంలో ఏసీపీఆధ్వర్యంలో సోమవారం అరెస్టు చూపారు. అరెస్టు అయిన వారిలో ఇద్దరు మైనర్లు ఉన్నారు. మహారాష్ట్రలోని సిర్వోంచ ప్రాంతంలో కొనుగోలు చేసిన 2.23 కిలోల ఎండు గంజాయి, ఒక బైక్, రెండు కత్తులు, మూడు సెల్‌ఫోన్లు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఏసీపీ రమేష్ మాట్లాడుతూ.. గోదావరిఖని పోలీసు సబ్ డివిజన్ పరిధిలో గంజాయి రవాణా, ఇతర మత్తు పదార్థాలపై నిఘా పెట్టినట్లు తెలిపారు. మంథని ఎస్ఐ రమేష్ ముగ్గురువ్యక్తులు గంజాయి రవాణా చేస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. వీరి విచారణలో మంథని ప్రాంతంలో మరో 20 మంది గంజాయి రవాణా, విక్రయాలు, తాగడం లాంటి అలవాటు చేసుకున్నట్లు గుర్తించామన్నారు. వారిపైన చర్యలు తీసుకుంటామన్నారు. పిల్లలు ఏం చేస్తున్నారో తల్లిదండ్రులు గమనించాలన్నారు. గోదావరిఖని టూటౌన్ సీఐ ప్రసాదరావు, ఎస్ఐ రమేష్‌లు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

హుజూరాబాద్‌రూరల్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ఈనెల 9న మండలంలోని కాట్రపల్లి గ్రామంలో ఓలారీ అతివేగంగా వచ్చి ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టిన ఘటనలో గాయపడిన క్షతగాత్రుడు చికిత్సపొందుతూ సోమవారం మృతిచెందాడు. పోలీసులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని విద్యానగర్‌కు చెందిన కొండపర్తి సమ్మయ్య ఈ నెల 9న తన ద్విచక్ర వాహనంపై కాట్రపల్లి నుంచి ఇంటికి వస్తున్నాడు. ఈ క్రమంలో ఓ లారీ వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ఘటనలో సమ్మయ్య తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన క్షతగాత్రుడిని కుటుంబ సభ్యులు మెరుగైన చికిత్సకోసం హన్మకొండలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కుమారుడు అశోక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

ముస్తాబాద్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గూడెం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడని ఎస్సై గణేశ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. గూడెం గ్రామానికి చెందిన పిట్ల దేవయ్య(60) ఆదివారం రాత్రి మద్యంతాగి రోడ్డుపై నిల్చొని ఉండగా అతడి కొడుకు చందు బలవంతంగా తీసుకువచ్చి ఇంట్లో ఉంచాడు. తెల్లారిసరికి పిట్టల దేవయ్య ఇంట్లో చనిపోయి ఉన్నాడని దేవయ్య తమ్ముడు లస్మయ్య ఫిర్యాదు చేశాడు. ఈ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పోగొట్టుకున్న మొబైల్‌ఫోన్ అందజేత

కరీంనగర్ క్రైం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలం నల్లగుంటపల్లికి చెందిన వడ్లూరి అంజయ్య ఇటీవల తన మొబైల్‌ఫోన్‌ను బొమ్మకల్‌లో పోగొట్టుకొని కరీంనగర్ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఐ నిరంజన్‌రెడ్డి ఆదేశాలతో సీఈఐఆర్ టెక్నాలజీ ద్వారా హన్మకొండలో ఉన్నట్లు గుర్తించారు. అనంతరం ఆ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. సోమవారం యజమానిని ఠాణాకు పిలిపించి ఫోన్ అప్పగించారు. ఈ సందర్భంగా ఫోన్‌ను ట్రేస్ చేయడంలో కృషి చేసిన కానిస్టేబుల్ విశ్వతేజను సీఐ అభినందించారు.

గ్రంథాలయం.. విజ్ఞాన భాండాగారం

● నేడు జాతీయ గ్రంథాలయ దినోత్సవం



కరీంనగర్ కల్చరల్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): చదవడం వ్యాయామం వంటిదని ఆంగ్ల వ్యాసకర్త, కవి, నాటక రచయిత జోసెఫ్ అడిసన్ అన్నారు. చద వడంతో మెదడు సామర్థ్యం, పనితీరు మెరుగుపడు తుంది. మస్తిష్క వికాసానికి మంచి సాధనం పుస్తకం. ప్రజల్లో చదివే అలవాటును ప్రోత్సహించడంతోపాటు అక్షరాస్యత, పుస్తకాల ప్రాముఖ్యతపై అవగాహన పెంచడానికి ఏటా ఆగస్టు 12 గ్రంథాలయోద్యమ పితామహుడు శియాలీ రామామృత రంగనాథన్ జన్మదిన సందర్భంగా జాతీయ గ్రంథాలయ దినోత్సవం నిర్వహిస్తున్నారు.

లైబ్రరీ సైన్స్ పితామహుడిగా రంగనాథన్ సేవలు

గ్రంథాలయాల ప్రాధాన్యం గుర్తించిన రంగనాథన్ లైబ్రరీ సైన్స్ పితామహుడిగా సేవలందించారు. విద్యావేత్తగా పలు రచనలు చేసి, గ్రంథాలయోద్యమంలో కీలక భూమిక పోషించారు. తమిళనాడులో మధ్య తరగతి బ్రాహ్మణ కుటుంబంలో సీతామహాలక్ష్మి-రామామృత అయ్యర్‌కు జన్మించిన ఆయన జీవితాన్ని రచనలు, గ్రంథాలయాల స్థాపనకు ధార పోశారు. ఇంగ్లాండ్‌లో లైబ్రరీ సైన్స్ చదివారు. యూనివర్సిటీలలో లెక్చరర్‌గా, లైబ్రేరియన్‌గా సేవలందించారు. మద్రాసు గ్రంథాలయ సంఘాన్ని స్థాపించడంలో కృషి చేశారు.

లుక్ కల్చర్ వద్దు.. బుక్ కల్చర్ ముద్దు

డిజిటల్ ఇంటర్నెట్, స్మార్ట్ ఫోన్, గూగుల్ వలలో పడి బుక్ కల్చర్ పోయి లుక్ కల్చర్ వచ్చింది. గ్రంథాలయాలు నిరాదరణకు గురవుతున్నాయి. పుస్తక పఠనం, గ్రంథాలయాల ప్రాముఖ్యత, పుస్తక మహోత్సవాలు, ప్రదర్శన వంటి కార్యక్రమాలు నిర్వహిస్తే మార్పు రావచ్చు.



గ్రంథాలయాలతో లాభాలు

గ్రంథాలయాల్లో పుస్తకాలు చదవడంతో జ్ఞాపకశక్తి, ఏకాగ్రత, కమ్యూనికేషన్ నైపుణ్యాలు మెరుగు పడుతా యి. రచన, పఠన, లేఖనం అలవాటు పెరుగుతుంది. స్పష్టంగా సంభాషించవచ్చు. చరిత్ర, సైన్స్, సాహిత్యం వంటి అంశాలపై సమాచారం లభిస్తుంది. వివిధ విషయాల అన్వేషణ, ప్రపంచం గురించి లోతైన అవగాహనకు వీలు కలుగుతుంది. కొత్త సంస్కృతులను, ఆలోచనలను, దృక్పథాలను పరిశీలిం చవచ్చు.

విమర్శనాత్మక నైపుణ్యాలు, సమస్య పరిష్కార సామర్థ్యాలు, తార్కిక దృష్టి, ఊహ, సృజనాత్మక పెరుగుతాయి. నిద్ర, ఆయుష్షు పెరుగుతుంది. అల్జీమర్ వ్యాధి వచ్చే అవకాశం తక్కువ.

పుస్తక పఠనంలో కీలకం

ఇంట్లో ఉన్న పుస్తకాలు, దిన, వార, మాస పత్రికలు, మ్యాగ్జైన్లతో పాటు గ్రంథాలయాలు పఠనలో కీలక పాత్ర పోషిస్తాయి. కావాల్సిన పుస్తకాలు ఇంటికి తెచ్చుకొని, నచ్చిన అంశాలు, సమాచారాన్ని నోట్ చేసుకొని తిరిగి ఇవ్వవచ్చు. ప్రస్తుతం జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని ప్రతీ రోజూ సుమారు 400 మందికి పైగా, పలు మండలాల్లో 120కి పైగా పాఠకులు సందర్శిస్తున్నారు.

చదువుతో విజ్ఞానం
సత్తు మల్లేశం, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్



చదువుతో విజ్ఞానం, వికాసం లభిస్తాయి. గ్రంథాలయంలో ఎప్పటికప్పుడు కొత్త పుస్తకాలు తెప్పిస్తున్నాం. స్మార్ట్ సిటీ నిధులతో చేపట్టిన నూతన భవన నిర్మాణం త్వరలో పూర్తవుతుంది. పాఠకులు గ్రంథాలయాలను వినియోగించుకోవాలి.

రోజూ వస్తాను
గుంటుకు జితేంద్ర, తాడిజెర్రి



రెండు సంవత్సరాల నుంచి రోజూ గంగాధర మండలం తాడిజెర్రి గ్రామం నుంచి డీసీఎల్‌కు వస్తాను. దిన పత్రికలు, సైన్స్ పుస్తకాలు చదువుతాను. ఎస్ఎస్‌సీ, ఆర్ఆర్‌బీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్నాను. ఇక్కడ ప్రశాంతంగా ఉంటుంది.

బైక్‌ను దొంగలించిన వ్యక్తి అరెస్ట్

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాజన్నపేటలో బైక్‌ను దొంగించిన సంఘటనలో సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని చిన్నబోనాలకు చెందిన బానోతు తిరుపతిని పట్టుకుని అరెస్ట్ చేశామని ఎస్ఐ రాహుల్‌రెడ్డి సోమవారం పేర్కొన్నారు. నిందితుడి వద్ద నుంచి ద్విచక్రవాహనాన్ని స్వాధీనపర్చుకున్నామని తెలిపారు. ఎస్ఐ రాహుల్‌రెడ్డి కథనం మేరకు.. మండలంలోని రాచర్లగొల్లపల్లి గ్రామానికి చెందిన ముత్యాల సాయికిరణ్‌కు రాజన్నపేట గ్రామ శివారులో వ్యవసాయ పొలం ఉంది. వ్యవసాయ బోరు మోటారు పని చేయక పోవడం వల్ల మరమ్మతు కోసం తంగళ్లపల్లి మండలం గండిలచ్చపేటలోని మెకానిక్ నీరటి శ్రీనివాస్‌కు సమాచారం అందించాడు. ఆయన ఈనెల 8న తన బైక్‌పై చేరుకుని వ్యవసాయ పొలం వద్దకు వెళ్లాడు. బోరు మోటారును మరమ్మతు చేసి వాహనం వద్దకు వచ్చే సరికి కనిపించకుండాపోయింది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. తిరుపతి ద్విచక్రవాహనాన్ని అపహరించాడని గుర్తించి పట్టుకున్నారు. కోర్టులో హాజరుపర్చడంతో న్యాయమూర్తి 14 రోజుల పాటు జైలుకు తరలించారని ఎస్ఐ రాహుల్‌రెడ్డి వివరించారు.

చట్ట వ్యతిరేక శక్తులపై ఉక్కుపాదం

● మధురానగర్‌లో పోలీసుల కార్డన్ సెర్చ్ ● పత్రాలు లేని 94వాహనాలు సీజ్

గంగాధర, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఏసీపీ ఎన్ వెంకటస్వామి హెచ్చరించారు. గంగాధర మండలం ప్రధానరహదారిపై మధురానగర్‌లో ఏసీపీ వెంకటస్వామి ఆధ్వర్యంలో విస్తృతంగా కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతి ఇంటిని క్షుణ్ణంగా తనిఖీ చేస్తూ అనుమానిత వ్యక్తుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. తనిఖీల్లో భాగంగా సరైన ధ్రువపత్రాలు లేని 91ద్విచక్రవాహనాలు, ఆటో, కారు, ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం చౌరస్తాలో ఏసీపీ వెంకటస్వామి మాట్లాడుతూ సైబర్ మోసాలకు గురైతే 1930 నంబరుకు ఫోన్ చేయాలన్నారు. గంటలోపు ఫోన్ చేస్తే పోగొట్టుకున్న సొమ్మును త్వరగా రికవరీ చేయవచ్చ న్నారు. మాదక ద్రవ్యాలు అక్రమరవాణా, అమ్మకం, వినియోగం చట్టపరంగా నేరమని తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలపై ప్రజలు 100లేక స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. డ్రగ్ రహిత సమాజ నిర్మాణంకోసం ప్రతిజ్ఞ చేయించారు.



మాట్లాడుతున్న ఏసీపీ వెంకటస్వామి

ఈ సందర్భంగా షీటీమ్ సీఐ శ్రీలత సోషల్ మీడియా వేదికగా జరుగుతున్న మోసాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో చొప్పదండి సీఐ ప్రదీప్‌కుమార్, సీఐలు శ్రీలత, కోటేశ్వర్‌రావు, సదన్ కుమార్, సంజీవ్, గంగాధర ఎస్సై వంశీకృష్ణ, ఎస్సైలు నరేంద్రరెడ్డి, యాంటీ నార్కోటిక్ బ్యూరో ఎస్సై పుల్లయ్య, సయ్యద్ అన్వర్, లక్ష్మారెడ్డి, నరేష్, ఇతర పోలీస్ సిబ్బంది, స్థానికులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రెండు ఆలయాల్లో చోరీ

● హుండీలు పగుల గొట్టి నగదు అపహరణ

గంగాధర, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): గంగాధర మండలం న్యాలకొండన్నపల్లి శివారులోని వేంకటేశ్వరస్వామి, శివాలయంలో గుర్తుతెలియని వ్యక్తులు తాళాలు పగులగొట్టి దొంగతనానికి పాల్పడినట్లు ఎస్సై వంశీకృష్ణ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. ఆదివారం రాత్రి వేంకటేశ్వరస్వామి ఆలయం, శివాలయాలకు ఎప్పటి మాదిరిగానే ఆలయ ఇన్‌చార్జి మేడిచెల్మల రాజు తాళాలు వేసి వెళ్లారు. సోమవారం ఆలయాలకు వచ్చి చూసేసరికి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. లోపలికి వెళ్లి పరిశీలించగా ఆలయంలోని హుండీలను పగుల గొట్టి అందులోని సుమారు 6వేల నగదును ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. ఆలయ ఇన్‌చార్జి రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మత్తులో డ్రైవర్ వీరంగం

గంగాధర, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మత్తులో విచక్షణ కోల్పోయిన డ్రైవర్ లారీ ఓనర్‌తో గొడవపడి వీరంగం సృష్టించాడు. స్థానికుల కథనం ప్రకారం.. యాపిల్ పళ్ల లోడుతో వచ్చిన లారీ కరీంనగర్ మార్కెట్లో డంపుచేసి తిరుగు పయణమయ్యారు. అయితే మత్తులోఉన్న లారీడ్రైవర్, ఓనర్‌తో గొడవకు దిగాడు. రామడుగు మండలం వెదిరలో ఇద్దరు తగవులాడుకున్నారు. దీంతో సహనం కోల్పోయిన ఓనర్ పోలీస్ స్టేషన్‌ను వెదుక్కుంటూ గంగాధరకు వచ్చాడు. గంగాధర పోలీస్‌స్టేషన్ సమీపంలో మరోమారు గొడవకుదిగారు. దీంతో మత్తులోఉన్న డ్రైవర్‌ను అంబులెన్స్‌లో కరీంనగర్‌కు తరలించినట్లు ఎస్సై వంశీకృష్ణ తెలిపారు.

పార్కింగ్ చేసిన కారును ఢీ కొట్టిన మరో కారు

హుజూరాబాద్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని కరీంనగర్ రోడ్‌లోని సబ్‌స్టేషన్ సమీపంలో ఆగి ఉన్న కారును వెనుక నుంచి మరో కారు ఢీ కొట్టింది. దీంతో ఆ కారు ముందు ఉన్న మరో కారును ఢీ కొట్టింది. దీంతో మూడు కార్లు ధ్వంసమయ్యాయి. ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. ఈ విషయంపై ఇరువురు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. కాగా కరీంనగర్ రోడ్‌లో ఉన్న రెండు హోటళ్ల ముందు వాహనాలు పార్కింగ్ చేస్తుంటారని, దీనిపై పోలీసులు పట్టించుకోవడం లేదని విమర్శలున్నాయి.

గొడవ పడ్డ వ్యక్తుల బైండోవర్

కోల్‌సిటీ, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని రాజేష్ థియేటర్ పాన్‌షాప్ వద్ద సిగరెట్ తాగే విషయంలో రోడ్డుపై గొడవపడ్డ పలువురు వ్యక్తులను సోమవారం బైండోవర్ చేసినట్టు వన్‌టౌన్ పోలీసులు పేర్కొన్నారు. చిన్నవిషయాలకు రోడ్డుపై పరస్పరం గొడవ పడడంతో ప్రజలు ఆందోళనకు గురయ్యారన్నారు. వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి ఘటన స్థలానికి వెళ్లి గొడవ పడిన వ్యక్తులను అరెస్టు చేశారన్నారు. వారు సత్ప్రవర్తనతో ఉండాలని, భవిష్యత్‌లో గొడవలు పడకుండా బైండోవర్ చేసినట్టు పోలీసులు పేర్కొన్నారు.

కుమారుడి జన్మదినానికి వచ్చి హఠాన్మరణం

● మూడు రోజుల క్రితమే సింగపూర్ నుంచి రాక



మధుకర్‌రెడ్డి(ఫైల్)

కరీంనగర్ క్రైం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): తన కొడుకు పుట్టినరోజు ఘనంగా నిర్వహించాలని అనుకున్న తండ్రి మూడు రోజుల ముందుగా సింగపూర్ నుంచి స్వగ్రామానికి వచ్చాడు. వేడుకలకు బంధువులు, స్నేహితులు ఆహ్వానించి అన్నిఏర్పాట్లు చేసుకున్నాడు. ఆదివారం తన కొడుకు జన్మదిన వేడుకలను నిర్వహించి విందులో పాల్గొంటుండగా గుండెపోటుకు గురై మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి.. కరీంనగర్ జిల్లా కరీంనగర్ రూరల్ మండలం చామనపల్లికి చెందిన దావు మధుకర్‌రెడ్డి(46) సింగపూర్‌లో పనిచేస్తూ జీవిస్తున్నాడు. ఆయన భార్య, కుమారుడు, కూతురు చామనపల్లిలో ఉంటున్నారు. మధుకర్‌రెడ్డి కుమారుడు సాత్విక్‌రెడ్డి 10వ జన్మదినం ఆదివారం ఉండగా, పుట్టినరోజు వేడుకలకు హాజరయ్యేందుకు మధుకర్‌రెడ్డి శనివారం(9వతేది) సింగపూర్ నుంచి చామనపల్లికి వచ్చాడు. అన్నిఏర్పాట్లు చేసుకుని బంధువులు, స్నేహితులను వేడుకలకు పిలుచుకుని ఇంటి వద్దనే ఆదివారం జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. అనంతరం రాత్రి బంధువులతో విందులో పాల్గొన్న మధుకర్‌రెడ్డి హఠాత్తుగా గుండె పోటుకు గురై కుప్పకూలిపోయాడు. కుటుంబ సభ్యులు, బంధువులు వెంటనే మధుకర్‌రెడ్డిని కరీంనగర్ ఆసుపత్రికి తరలించగా అప్పటికే ఆయన మృతి చెందినట్లుగా వైద్యులు నిర్ధారించారు. ఈ హఠాత్ పరిణామంతో మధుకర్‌రెడ్డి భార్య, కూతురు, కొడుకు, బంధువులు ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. మధుకర్‌రెడ్డి ఈ నెల 9 నుంచి 10 రోజుల సెలవుపై స్వగ్రామానికి వచ్చాడు. శనివారం రాఖీపౌర్ణమి పండుగను జరుపుకోగా, ఈ నెల 17న సమీపబంధువు వివాహానికి హాజరై 19న తిరిగి సింగపూర్ వెళ్లాల్సి ఉంది.

గ్యాస్‌స్టౌవ్ రిపేర్ షాపుల్లో పోలీసుల తనిఖీలు

కోల్‌సిటీ, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని పట్టణంలోని గ్యాస్ స్టౌవ్‌లు, సిలిండర్ రిపేర్ షాపుల్లో సోమవారం వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. గ్యాస్ రీఫిల్లింగ్ చేస్తున్నారనే సమాచారం మేరకు తనిఖీలు జరిపారు. కొందరు వ్యాపారులు గ్యాస్‌స్టౌవ్ రిపేర్ల పేర సిలిండర్ల నుంచి ఎలక్ట్రికల్ డీసీ మోటార్ల సహాయంతో కార్లలో గ్యాస్‌రీఫిల్లింగ్ చేస్తున్నారని, చిన్న సిలిండర్లలో గ్యాస్ నింపుతున్నారన్నారు. అలా గ్యాస్ నింపే క్రమంలో ఇటీవల మంటలు రావడంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారని, కొందరు చొరవ తీసుకుని మంటలు ఆర్పకపోతే భారీ ప్రమాదం జరిగేదన్నారు. గ్యాస్ రీఫిల్లింగ్ చేయడం నేరమని, ఇలాంటి వారికి సిలిండర్ అమ్మినా, సహకరించినా నేరస్థులుగా పరిగణిస్తామన్నారు. గ్యాస్ స్టౌవ్ రిపేర్ చేసే యజమానులు, అందులో పని చేసే వారిని బైండోవర్ చేసినట్టు సీఐ తెలిపారు.



షాపులను తనిఖీ చేస్తున్న సీఐ ఇంద్రసేనారెడ్డి

గంజాయి విక్రయదారుల అరెస్ట్

● 50 గ్రాముల ఎండు గంజాయి, బైక్ స్వాధీనం

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట పోలీస్ సర్కిల్ పరిధిలోని వీర్నపల్లి మండలం రంగంపేట గ్రామశివారులో విక్రయించేందుకు వచ్చిన ముగ్గురు యువకులు స్థానిక పోలీసులకు చిక్కారు. వారివద్ద నుంచి 50గ్రాముల ఎండు గంజాయితోపాటు ద్విచక్రవాహనాన్ని స్వాధీనపర్చున్నారు. ఎల్లారెడ్డిపేట రూరల్ సీఐ శ్రీనివాస్ సోమవారం వివరాలను వెల్లడించారు. వీర్నపల్లి మండలం రంగంపేట గ్రామశివారులోని జంపన్న చెరువు ప్రాంతంలో గంజాయి విక్రయిస్తున్నారనే సమాచారంతో ఎస్ఐ లక్ష్మణ్ ఆధ్వర్యంలోని పోలీసులు అక్కడకు చేరుకున్నారు. నిజామాబాద్ జిల్లా సిరికొండ మండలం పందిమడుగు, వీర్నపల్లి మండలం సీతారాంనాయక్‌తండాలో నివాసం ఉంటున్న సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని రగుడువాసి బానోతు అజయ్‌కుమార్, సీతారాంనాయక్‌తండాలోని అజ్మీరా సాయివిశాల్‌లు తచ్చాడుతూ కనిపించారు. అదుపులోకి తీసుకుని తనిఖీ నిర్వహించడంతో వారివద్ద గంజాయి లభించింది. గంజాయికి అలవాటు పడిన నిందితులు నిజామాబాద్ పట్టణంలోని గుర్తు తెలియని వ్యక్తి వద్ద తక్కువ ధరకు కొనుగోలు చేసి ఈ ప్రాంతంలోని యువకులకు అధిక ధరకు విక్రయిస్తున్నారని విచారణలో తేలింది. ముగ్గురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ శ్రీనివాస్ వివరించారు. నిందితులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన ఎస్ఐ లక్ష్మణ్, సిబ్బందిని సీఐ శ్రీనివాస్ అభినందించారు.

అదుపులోకి రాని మంటలు

● సివిల్ సప్లయిస్ గోదాంలో శ్రమిస్తున్న అగ్నిమాపక సిబ్బంది
● దగ్ధమైన 9.07 లక్షల గోనె సంచులు, రూ.70లక్షలు నష్టం
● మంటలు ఆర్పడానికి మిషన్ భగీరథ నీరు

మెట్‌పల్లి రూరల్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): జగిత్యాలజిల్లా మెట్‌పల్లిపట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డు ఆవరణలోగల సివిల్‌సప్లయిస్ గోదాంలో చెలరేగిన మంటలను ఆర్పడానికి అగ్నిమాపక సిబ్బంది అవిశ్రాంతంగా శ్రమిస్తున్నారు. గోదాంలోని 9.07లక్షల గోనె సంచులు దగ్ధం కాగా రూ.70లక్షలు నష్టం వాటిల్లిందని సివిల్‌సప్లయిస్ డీఎం జితేందర్ ప్రసాద్ తెలిపారు. ఆదివారం ఉదయం అకస్మాత్తుగా గోదాంలో నుంచి దట్టమైన పొగరావడాన్ని స్థానికులు గమనించి వెంటనే గోదాం ఇన్‌చార్జి బూరం సురేష్‌తో పాటు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక డీఎఫ్‌వో మధుకర్‌రెడ్డి నేతృత్వంలో మెట్‌పల్లి, జగిత్యాల, భీంగల్, ఖానాపూర్, ధర్మపురి అగ్నిమాపకకేంద్రాల నుంచి ఫైరింజన్లు తెచ్చి సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. సోమవారం మంటలు మరింతగా వ్యాపించడంతో అగ్నిమాపక వాహనాలకు నీరు సమయానికి అందకపోవడంతో పక్కన ఉన్న మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్‌లోని నీటిని వాడుతున్నారు. గోదాంలో నుంచి దట్టమైన పొగతో మంటలు ఎగిసిపడడంతో ఎక్స్‌కవేటర్లతో గోదాం గోడలను బద్దలు కొట్టి అందులోంచి కాలుతున్న గన్ని సంచులను బయటకు తీసుకొచ్చి ఆర్పివేసే ప్రయత్నం చేస్తున్నారు. కాగా మంటల వేడితో ఏ క్షణమైనా గోదాం కూలే ప్రమాదం ఉందని అధికారులు భావిస్తున్నారు. ఎలాంటి ప్రమాదం జరగకుండా చుట్టుపక్కల వారిని అధికారులు అప్రమత్తం చేశారు. అగ్ని ప్రమాదానికి గల కారణాలు స్పష్టంగా తెలియరాలేదు. గోదాం కిటికీలు తెరిచి ఉండడం, గోదాం చుట్టూ మద్యం సీసాలు ఉండడంతో మద్యం బాబుల పనా లేక ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా అని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



మెట్‌పల్లి ఏఎంసీలోని గోదాంలో మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న జగిత్యాల కలెక్టర్ సత్యప్రసాద్

● మంటలు త్వరగా అదుపులోకి తీసుకురావాలి..

- కలెక్టర్ సత్యప్రసాద్

మంటలను త్వరగా అదుపులోకి తీసుకొచ్చి ఎలాంటి ప్రమాదం జరగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు కలెక్టర్ సత్యప్రసాద్ సూచించారు. సోమవారం మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్‌లోని గోదాం అగ్ని ప్రమాద స్థలాన్ని ఆయన సందర్శించారు. అగ్ని మాపక అగ్ని మాపక డీఎఫ్‌వో మధుకర్‌రెడ్డితో మాట్లాడి త్వరగా మంటలను ఆర్పివేయాలని ఆదేశించారు. మంటలు చల్లారేవరకు అధికారులు అందుబాటులోనే ఉండాలని సూచించారు. ఆయన వెంట ఆర్డీవో శ్రీనివాస్, సివిల్ సప్లయిస్ డీఎం జితేందర్‌ప్రసాద్, డీఎస్పీ రాములు, సీఐ అనిల్‌కుమార్, ఎస్సైలు కిరణ్‌కుమార్, చిరంజీవి, అనిల్, తహసీల్దార్ నీత, ఎంపీడీవో మహేశ్వర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ మోహన్ ఉన్నారు.

రూ.7600 పలికిన పత్తి ధర

జమ్మికుంట, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తిధర రూ.7600 పలికింది. సోమవారం మార్కెట్ యార్డుకు ఇద్దరురైతులు పదిక్వింటాళ్ల విడిపత్తి విక్రయానికి తీసుకువచ్చా రు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వార గరిష్ఠ ధర రూ.7600 చెల్లించి ప్రైవేట్ ట్రేడర్స్ కొనుగోళ్ల చేపట్టారు.

108వాహనం తనిఖీ

శంకరపట్నం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడికరీంనగర్ జిల్లా 108 నూతన ప్రోగ్రాంమేనేజర్ జనార్దన్ శంకరపట్నం 108వాహనాన్ని సోమవారం ఆకస్మికంగా తనిఖీచేశారు. వాహనంలో ఉన్న వైద్యపరికరాలను, వాటి పనితీరు, ఔషధాలను, రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అంకితభావంతో పనిచేసే ప్రతిఉద్యోగికి గుర్తింపు ఉంటుందన్నారు. ప్రమాదంలో గాయపడిన వ్యక్తులకు మెరుగైన వైద్య సేవలందిస్తూ సమీప ప్రభుత్వాస్పత్రిలో చేర్పించాలన్నారు. 108సిబ్బంది ఈఎంటీ గూడూరు సతీష్‌రెడ్డి, పైలెట్ ఖాజాఖలీల్ పనితీరుపై సంతృప్తి పొందారు.

ఇసుక తరలిస్తున్న వాహనం పట్టివేత

తిమ్మాపూర్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేణికుంట గ్రామంలోని మోయతుమ్మెదవాగు నుంచి అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న వాహనాన్ని రేణికుంటలో ఎల్ఎండీ పోలీసులు పట్టుకున్నారు. వాహనయాజమాని, డ్రైవర్‌అయిన కోహెడమండలం వింజపల్లి గ్రామానికి చెందిన గీకురురమేష్‌పై కేసునమోదు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

శంకరపట్నం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అనుమతులు లేకుండా వీణవంక మండలం కోర్కల్ గ్రామంనుంచి హుజూరాబాద్‌కు ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను ఆముదాలపల్లి శివారులో సోమవారం కేశవపట్నం పోలీసులు పట్టుకున్నారు. కోర్కల్ గ్రామానికిచెందిన ట్రాక్టర్ డ్రైవర్ ఎరవేణి శ్రీనివాస్‌పై కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐశేఖర్‌రెడ్డి తెలిపారు.

ఇద్దరిపై కేసు నమోదు

ఇల్లందకుంట, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ అనిల్‌కుమార్, అటెండర్ రాకేష్ ఈనెల 5నవిధులు నిర్వహిస్తుండగా గట్టు సాయిరాం, పసునూటి శివ ఇవ్వాళ ఎందుకు డ్యూటీకి వచ్చారని, ఆదివారం సెలవు రోజు ఎందుకు పని చేస్తున్నారని బెదిరించారు. తీవ్రపదజాలంతో దూషించారు. విధులకు ఆటంకం కలిగించినట్లు అనిల్‌కుమార్ సోమవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ క్రాంతికుమార్ తెలిపారు.

హరహర మహాదేవ.. శంభో శంకరా..



ఆలయ ఆవరణలో భక్తులు

- భక్తజన సంద్రంగా మారిన రాజన్న క్షేత్రం
- కోడెమొక్కులు, కుంకుమ పూజలో పాల్గొన్న భక్తులు

వేములవాడ కల్చరల్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): హర హర మహాదేవ.. శంభో శంకరా.. అంటూ భక్తులు చేసిన నినాదాలతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. శ్రావణ సోమవారం సందర్భంగా రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి 50 వేలకు పైగా భక్తులు ఆలయానికి తరలివచ్చారు. సోమవారం తెల్లవారుజామునే భక్తులు రాజన్న ఆలయ ధర్మగుండంలో పవిత్రస్నానాలు ఆచరించారు. భక్తులు శివసత్తుల పూనకాలతో ఊగిపోయారు. రాజన్నకు ఎంతో ప్రీతిపాత్రమైన కోడెమొక్కు చెల్లించుకునేందుకు క్యూలైన్‌లో నాలుగు గంటల పాటు నిరీక్షించినట్లు భక్తులు తెలిపారు. భక్తులు కుంకుమ పూజలో పాల్గొన్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఈవో రాధాబాయి ఆధ్వర్యంలో ఏఈవోలు బ్రహ్మన్న గారి శ్రీనివాస్, శ్రావణ్ కుమార్, అశోక్‌కుమార్ ఉద్యోగులు నరేందర్, శ్రీనివాస్ చారి, రాజేందర్‌లు ఏర్పాట్లను పర్యవేక్షిస్తూ క్యూలైన్‌లు త్వరగా కదిలేలా చర్యలు తీసుకున్నారు.

భీమన్న ఆలయంలో మహాలింగార్చన

వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి అనుబంధ ఆలయమైన భీమన్న ఆలయంలో సోమవారం మహాలింగార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాజన్న ఆలయ ఈవో రాధాబాయి హాజరై దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. కుమార్, సూపరింటెండెంట్ వెంకటప్రసాద్, రాజేశ్వర్‌రావు ఉన్నారు.



ఆర్‌ఎఫ్‌సీఎల్ నుంచి ఉమ్మడి జిల్లాకు 6 వేల టన్నుల యూరియా

- పెద్దపల్లి జిల్లా కలెక్టర్ చొరవ
- ఐదు రోజుల్లో మూడు విడుతలుగా రవాణా...
- యూరియా కొరత వేళ యుద్ధ ప్రాతిపదికన సరఫరా

కోల్‌సిటీ, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో యూరియా కొరత ఏర్పడింది. ఈ నేపథ్యంలో ఆర్‌ఎఫ్‌సీఎల్ యుద్ధ ప్రాతిపదికన యూరియా సరఫరా చేస్తుంది. ప్రాథమిక సహకార సంఘాల వద్ద యూరియా కొరతతో రైతులు బారులు తీరుతున్నారు. ఈ పరిస్థితుల్లో ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు ఐదు రోజుల్లో 6వేల టన్నుల యూరియాను ఆర్‌ఎఫ్‌సీఎల్ సరఫరా చేసింది. కలెక్టర్ కోయ శ్రీహర్ష ప్రత్యేక చొరవ తీసుకుని యాజమాన్యాన్ని సమన్వయం చేస్తున్నారు.

పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాలకు చెందిన ముగ్గురు వ్యవసాయశాఖ అధికారులు ఆర్‌ఎఫ్‌సీఎల్ యాజమాన్యంతో సమన్వయం చేస్తున్నారు. పెద్దపల్లి జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఆధ్వర్యంలో మంథని, మంచిర్యాల ఏడీఏ, రామగుండం వ్యవసాయశాఖ అధికారి రేక్‌ల ద్వారా యూరియా రవాణాను పర్యవేక్షిస్తున్నారు. ఒక రేక్ పూర్తిగా, రెండు రేక్‌లు సగం చొప్పున కరీంనగర్ రైల్వేయార్డ్‌కు పంపించారు. అక్కడి నుంచి కరీంనగర్, జగిత్యాల, సిరిసిల్లా, పెద్దపల్లి జిల్లాలకు సరఫరా చేస్తున్నారు. అధికంగా పెద్దపల్లి జిల్లాకు సరఫరా చేశారు.

ఆగస్టులో 1.5లక్షల టన్నుల యూరియా రవాణాను కేంద్ర ప్రభుత్వం ఆర్‌ఎఫ్‌సీఎల్‌కు టార్గెట్‌గా నిర్ణయించింది. అందులో 65వేల టన్నులు తెలంగాణకే సరఫరా చేయాల్సి ఉంది. ఇప్పటివరకు కరీంనగర్, మంచిర్యాల, మిర్యాలగూడ, నిజామాబాద్‌లకు డిమాండ్‌ను బట్టి వెంట వెంటనే సరఫరా చేస్తున్నారు. ఒక్కో సమయంలో సగం రేక్ ఒక జిల్లా, మరో సగం రేక్ మరో జిల్లాకు పంపించాల్సిన పరిస్థితి ఏర్పడింది. సోమవారం జడ్చర్లకు 3వేల టన్నుల రేక్‌ను పంపారు. ఎక్కడెక్కడ యూరియా కొరత తీవ్రత ఉందో అక్కడికి వెంట వెంటనే యూరియా రవాణా చేస్తున్నారు. ఎలాంటి సాంకేతిక అవరోధాలు ఏర్పడకపోతే ఆగస్టు మాసంలో 50వేల టన్నుల నుంచి 55వేల టన్నుల యూరియా తెలంగాణకు సరఫరా చేసే అవకాశం ఉంది.



యూరియా అన్‌లోడ్ చేస్తున్న కార్మికులు


ట్రాన్స్‌ఫార్మర్ చోరీల కేసులో నిందితుల అరెస్టు

భీమదేవరపల్లి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): వరంగల్, కరీంనగర్ కమిషన రేట్ల పరిధిలో ట్రాన్స్‌ఫార్మర్లు చోరీ చేస్తున్న ఇద్దరు నిందితులను హన్మకొండ జిల్లా ముల్కనూర్ ఎస్‌ఐ సాయిబాబు పట్టుకున్నారు. ముల్కనూర్ పోలీస్ స్టేషన్‌లో సోమవారం సాయంత్రం ఏసీపీ పింగిలి ప్రశాంత్ రెడ్డి సీఐ పులి రమేష్ విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండల కేంద్రానికి చెందిన బండి కుమార్, సతీష్ సోదరులు. వీరు ట్రాన్స్‌ఫార్మర్లు దొంగలిస్తూ అందులో ఉన్న కాపర్, అల్యూమినియం వైర్లను అమ్మివాటితో వచ్చిన సొమ్ముతో జల్సాలు చేస్తున్నారు. సోమవారం ఉదయం ముల్కనూర్ ఎస్‌ఐ సాయిబాబు వాహనంలో వెళ్తుండగా, ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వెళ్తూ అనుమానాస్పదంగా కనిపించారు. వారిని తనిఖీ చేయగా వారి వద్ద టూల్స్ కనిపించాయి. విచారించగా ట్రాన్స్ ఫార్మర్లు చోరీ చేస్తున్న విషయాన్ని వెల్లడించారు. తాము చోరీ చేసిన కాపర్, అల్యూమినియం వైర్‌ను ముల్కనూర్‌కు చెందిన రుద్రాక్ష తిరుపతికి విక్రయిస్తున్నట్లు తెలిపారు. దీంతో పోలీసులు కుమార్, సతీష్, తిరుపతిని అరెస్టు చేశారు. నిందితుల వద్ద నుంచి రూ. 2.5 లక్షల విలువ చేసే 250 కిలోల కాపర్ వైరు, మూడు కరెంటు మోటార్లు, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకొని సీజ్ చేశారు.



మాట్లాడుతున్న ఏసీపీ ప్రశాంత్‌రెడ్డి

విద్యుత్ ఉద్యోగులకు భరోసా



- అందుబాటులోకి బీమా పథకం
- విధి నిర్వహణలో మృతి చెందితే రూ. కోటి పరిహారం
- తీవ్రంగా గాయపడితే రూ.80లక్షలు
- సహజమరణం చెందితే రూ.10లక్షలు

గణేశ్‌నగర్,ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ శాఖలో ఉద్యోగమంటే ప్రాణంతో చెలగాటమే. ప్రమాదం ఎప్పుడు ఎక్కడి నుంచి ముంచుకు వస్తుందో తెలియదు. నిత్యం ప్రమాదం అంచున ఉద్యోగులు పని చేయాల్సి ఉంటుంది. అటువంటి వారికి సామాజిక, ఆర్థిక భద్రత కల్పించేందుకు బీమా అమలులోకి వచ్చింది. నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ (ఎన్పీడీసీఎల్) సీఎండీ వరుణ్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని విద్యుత్ ఉద్యోగు లందరికీ బీమా సౌకర్యం కల్పించారు.

ఎలాంటి కంట్రిబ్యూషన్ లేకుండానే...

బీమా పొందాలంటే ప్రత్యేకంగా పాలసీ తీసుకోవాల్సిన అవసరం లేదు. ఉద్యోగి బ్యాంక్ ఖాతాలో ప్రతీ నెలా వేతనం జమ అయితే చాలు. విద్యుత్ సిబ్బందిలో నమ్మకం, ధైర్యాన్ని ఇవ్వడం కోసం ఎలాంటి కంట్రిబ్యూషన్ లేకుండా ఈ పథకాన్ని తీసుకొచ్చారు. ఉద్యోగి వేతనం నెలకు 25 వేలకు పైగా ఉడాలి. ఒప్పందం చేసుకున్న బ్యాంకుల్లో ప్రతీనెల జీతం జమ కావడమే ఈ బీమాకు అర్హత. ప్రారంభంలో మొదటి నెల 1న జీతం జమ చేస్తే మరుసటి నెల 1వ తేదీ నుంచి నుంచి బీమా వర్తిస్తుంది. మూడు నెలల్లో ఒక్క సారైన డబ్బులు డ్రా చేసుకోవాలి. ఎన్పీడీసీఎల్ పరిధిలో పని చేసే అటెండర్, వాచమన్ మొదలుకొని ఎస్‌ఈ వరకు ఈ బీమా వర్తిస్తుంది. ఈ బీమా పథకం ఎన్పీడీసీఎల్ పరిధిలోని 16 జిల్లాలకు గాను 13,287 మంది ఉద్యోగులకు వర్తించగా వీరిలో ఉద్యోగులు 9,821 కాగా ఆర్టిజన్ కార్మికులు 3,466 మంది ఉన్నారు. ఈ పథకం కింద జిల్లాలో సుమారు 1918 మందికి పైగా ఉద్యోగులు లబ్ధి పొందుతున్నారు.

భారీగా పరిహారం

గతంలో విద్యుత్ ఉద్యోగి విధి నిర్వహణలో మరణించినా, తీవ్రంగా గాయపడినా సంస్థ అందించే పరిహారం తక్కువగా ఉండేది. వారు వ్యక్తిగతంగా చేసుకున్న బీమా పాలసీల ద్వారా మాత్రమే పరిహారం అందేది. ప్రస్తుతం కల్పిస్తున్న బీమా సౌకర్యం వల్ల విధినిర్వహణలో విద్యుత్ ఉద్యోగి మరణిస్తే కోటి రూపాయల వరకు పరిహారం అందుతుంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కదలలేని స్థితిలో ఉన్న ఉద్యోగులకూ కోటి రూపాయల వరకు పరిహారం అందేలా ఏర్పాట్లుచేశారు. శాశ్వత అంగవైకల్యం (పీపీడీ) కలిగిన వారికి 80లక్షల పరిహారం వరకు అందుతుంది. ఉద్యోగి సహజమరణం చెందితే 10 లక్షల రూపాయల వరకు బీమా ఉంటుంది. ఉద్యోగితో పాటు నలుగురు కుటుంబ సభ్యులకు కలిపి 20 లక్షల వరకు బీమా సౌకర్యం ఉంటుంది. ఈ మేరకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ), యూనియన్ బ్యాంక్(యూబీఐ)తో ఒప్పందాలు కుదుర్చుకున్నారు. ఎస్‌బీఐలో ఖాతా తెరిచిన విద్యుత్ ఉద్యోగులకు కేవలం ప్రమాద బీమానే కాకుండా పెళ్లి, విద్య పరమైన సహాయంలోను రుణాలు బ్యాంకులు అందించనున్నారు.



మృతి చెందిన విద్యుత్ కార్మికుడి కుటుంబానికి కోటి రూపాయల ప్రమాద బీమా పరిహారం (ఫైల్)

బీమా పథకంతో ఉద్యోగులకు మేలు

మేక రమేష్‌బాబు, టీజీఎన్పీడీసీఎల్ ఎస్‌ఈ



గతంలో డిపార్ట్మెంట్ పరంగా లేదా సొంతంగా చేసుకున్న బీమా పథకం ద్వారా మాత్రమే పరిహారం అందేది. ఇటీవల కరీంనగర్ సర్కిల్ పరిధిలోని చెంజర్ల సెక్షన్‌లో పని చేసే జోగు నరేశ్ ప్రమాదవశాత్తు మృతి చెందాడు. ఆయన కుటుంబానికి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకోటి రూపాయల ప్రమాద బీమా పరిహారం అందజేశారు. ఈ పథకం ద్వారా జిల్లాలో 1,918 మందికిపైగా ఉద్యోగులకు మేలు జరుగుతుంది.



ఆలయ వసతి గదుల్లో నాగుపాము

వేములవాడ కల్చరల్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయ పార్వతిపురం వసతి గదుల్లో నాగుపాము ప్రత్యక్ష మైంది. వసతి గదుల బ్లాక్‌లో మెట్ల కిందకు వెళ్లిపోయింది. దీంతో ఆలయ ఉద్యోగులు స్నేక్ క్యాచర్‌కు సమాచారం అందించడంతో పామును పట్టుకునేందుకు సదరు వ్యక్తి గంటపాటు శ్రమించినట్లు తెలిపారు. ఆలయ వసతి గదుల్లో నాగుపాము రావడంతో భక్తులు భయాందోళనకు గురయ్యారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

వరల్డ్ బ్యాంకు కన్సల్టెన్సీ టీం సభ్యుడు కిషన్

మానకొండూర్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని వ్యాధులకు దూరంగా ఉండాలని వరల్డ్ బ్యాంకు కన్సల్టెన్సీ టీం సభ్యులు కిషన్, పిలిప్ సూచించారు. మండలంలోని అన్నారం సబ్‌సెంటర్‌ను సోమవారం వారు సందర్శించారు. గ్రామంలో శానిటేషన్, ప్రజల ఆరోగ్యం, పరసరాల పరిశుభ్రత, వైద్యసేవలపై గ్రామస్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల విద్య, వైద్యం, తదితర విషయాలను తెలుసుకున్నారు.

వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే వ్యాధులు దరి చేరవన్నారు. మురికి కాల్వలలో నీటి నిల్వ లేకుండా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు సల్మాన్, రాజ్‌నాయక్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఫోన్ ట్యాపింగ్ విచారణలో రాజకీయ జోక్యం ఉండదు

- పార్టీ మారిన ఎమ్మెల్యేలపై నిర్ణయం స్పీకర్‌దే
- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు, పక్కన మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం

కరీంనగర్ అర్బన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్ విచారణలో రాజకీయ జోక్యం ఉండదని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. సోమవారం కరీంనగర్‌లో సుడా వాణిజ్య భవన సముదాయ నిర్మాణానికి, ఐడీఎస్‌ఎంటీ షాపింగ్ కాంప్లెక్స్ ఆధునికీకరణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఫోన్‌ట్యాపింగ్ వ్యవహారంపై రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం కూడా విచారణ జరుపుతున్నట్లు చెప్పారు. గత ప్రభుత్వం ఫోన్ ట్యాపింగ్ విషయంలో పెద్ద తప్పు చేసిందని, విచారణలో అన్ని విషయాలూ వెల్లడవుతాయని అన్నారు.

మరోసారి ఇలాంటివి జరుగకుండా తప్పు చేసినవారికి శిక్ష పడేలా కార్యాచరణ ఉంటుందన్నారు. ఎవరిని విచారించాలన్న దానిపై సిట్ బృందం నిర్ణయం తీసుకుంటుందన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ లోపాయికారి ఒప్పందంతో ముందుకుసాగుతున్నాయని విమర్శించారు. కాళేశ్వరం నిర్మాణం తరువాత ఐదేళ్లు బీజేపీ అధికారంలో ఉందని, దానిపై ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాట్లాడుతుంటే అడ్డుకోవడంతోపాటు బీఆర్ ఎస్‌కు షెల్టర్ ఇవ్వాలనే ఆలోచనతో ఉన్నట్లు బీజేపీ నాయకుల వైఖరి కనిపిస్తోందన్నారు.

కేంద్రం పరిధిలో బీసీ రిజర్వేషన్ల బిల్లు

బీసీల 42 శాతం రిజర్వేషన్ల బిల్లుకు అసెంబ్లీలో ఆమోదం తెలిపి గవర్నర్‌కు పంపించామని, గవర్నర్ రాష్ట్రపతికి పంపించారని మంత్రి తెలిపారు. ఇప్పుడు బిల్లు కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఉందని, వారే వెల్లడించాలని అన్నారు. రిజర్వేషన్ల బిల్లుపై చిత్తశుద్ధి ఉం టే బీజేపీ ఎనిమిది మంది ఎంపీలు జంతర్‌మంతర్ ధర్నాలో ఎందుకు పాల్గొలేదని ప్రశ్నించారు. వివిధ పార్టీల ఎంపీలు ధర్నాకు సంఘీభావం తెలిపారన్నారు. పార్టీమారిన 10 మంది ఎమ్మెల్యే లపై స్పీకర్ నిర్ణయం తీసుకుంటారన్నారు.

కరీంనగర్‌లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికపై అతి త్వరలో కార్యాచరణ ఉంటుందన్నారు. పారి శ్రామిక కారిడార్‌కు కేంద్రం ప్రభుత్వం కొన్ని నిర్ణయాలు ప్రకటించిందని, ప్రతిపాదనలు పంపిస్తున్నామని తెలిపారు. ఇందుకు కేంద్రమంత్రులు బండి సంజయ్, కిషన్‌రెడ్డి సహకారం కోరుతున్నామన్నారు. తెలంగాణలో పారిశ్రామికవాడలు, పెట్టుబడులు రావాలని, ఇక్కడ ఉన్న యువత కు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని బేషజాలు లేకుండా కేంద్రమంత్రులను కలుస్తున్నామని తెలిపారు.

డ్యాం సేఫ్టీ అథారిటీ నివేదిక ప్రకారమే ముందుకు

కాళేశ్వరం ప్రాజెక్టుపై డ్యాం సేఫ్టీ అథారిటీ నివేదిక ప్రకారమే రాష్ట్ర ప్రభుత్వం ముందుకుసాగుతుందని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. ప్లానింగ్ ఎగ్జిక్యూషన్‌లో నిర్మాణంలో లోపాలున్నాయని, నీటిని నిలువ చేస్తే ప్రమాదం జరిగే అవకాశం ఉందని డ్యాంసేఫ్టీ అధికారులు నివేదికలో చెప్పడంతో నీటిని నిలువ చేయలేదన్నారు. నీటిని నిలువతో మేడిగడ్డ సమస్య ఎదురైతే ఆ పరిసరాలు ముంపునకు గురయ్యే అవకాశముందన్నారు. అందుకే అథారిటీ ఇచ్చే నివేదిక ద్వారా ప్రతీ కార్యక్రమం చేపట్టాలని ఆలోచన చేస్తున్నామన్నారు.

కాళేశ్వరం ప్రాజెక్టుపై కొంత మంది డ్రామాలాడు తున్నారని, నాణ్యతతో పనులు ఎందుకు చేపట్టలేదని ప్రశ్నించారు. మేడిగడ్డ ప్రాజెక్టు కూలిపోతే ఆ రోజు ఏమీ మాట్లాడని వారు ఈ రోజు నీరు కావాలంటున్నారని, అథారిటీ నివేదిక నిర్ధారణ సర్టిఫికెట్‌ను ఉపయోగించి చర్యలు తీసుకుంటామని అన్నారు. రైతులకు న్యాయం చేసేందుకు తాము వెనుకడుగువేయబోమన్నారు. సమావేశంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కటుకం మృత్యుంజయం, ఆరెపల్లి మోహన్, నాయకులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సంక్షేమానికి హెల్త్ స్కీం అవసరం



మంత్రులకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఉద్యోగులు

సుభాష్‌నగర్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమానికి హెల్త్ స్కీం అవసరమని టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం నగరంలోని సుడా కార్యాలయంలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు, ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రి శ్రీధర్‌బాబు దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా బెనిఫిట్స్ చెల్లింపుల్లో ఆలస్యం, హెల్త్‌స్కీం అమలు అవసరాలను వివరించారు. హౌస్ బిల్డింగ్ రుణాలు, జీపీఎఫ్ రుణాలు, టీఏ బిల్లులు, జీఎల్ఐ బిల్లులు, వైద్య ఖర్చులకు సంబంధించిన బిల్లులు సకాలంలో చెల్లించడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, వారి కుటుంబాలకు నగదు రహిత వైద్యం అందించడంలో ఎంప్లాయిస్ హెల్త్‌స్కీం కీలకపాత్ర పోషిస్తుందన్నారు వైద్య ఖర్చుల భారం గణనీయంగా తగ్గుతుందన్నారు. మంత్రి శ్రీధర్‌బాబు స్పందించి ఎంప్లాయిస్ హెల్త్ స్కీంకు సంబంధించి త్వరలోనే తీపి కబురు వింటారని ఉద్యోగులకు భరోసా కల్పించారు. సంఘం అసోసియేట్ అధ్యక్షుడు ఒంటెల రవీందర్‌రెడ్డి, కేంద్ర సంఘం నాయకులు నాగుల నర్సింహస్వామి, గూడ ప్రభాకర్‌రెడ్డి, సర్దార్ హర్మిందర్‌సింగ్, జిల్లా కోశాధికారి ముప్పిడి కిరణ్ కు మార్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు మారుపాక రాజేశ్ భరద్వాజ్, కార్యదర్శి వెలి చాల సుమంత్‌రావు, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శి శంకర్, ఎడ్ల మహేశ్, అజయ్‌కుమార్ పాల్గొన్నారు.


శ్రీరాంసాగర్‌కు తగ్గిన ఇన్‌ఫ్లో

ప్రాజెక్టులోకి 11,483 క్యూసెక్కుల నీరు రాక

జగిత్యాల, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి సోమవారం ఇన్‌ఫ్లో తగ్గింది. ఎస్సారెస్పీలోకి 11,483 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 80.5 సామర్థ్యానికి గాను ప్రస్తుతం 44.71 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ, సాగు నీటి కాలువలు, కలిపి ప్రాజెక్టు నుంచి 5,658 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ఇందులో కాకతీయ కాలువకు 3,500 క్యూసెక్కులు, సరస్వతీ కాలువకు 800 క్యూసెక్కులు, లక్ష్మీ కాలువకు 150 క్యూసెక్కులు, వరద కాలువకు 3 వేల క్యూసెక్కులు, అల్లీ సాగర్ ఎత్తిపోతల పథకానికి 360 క్యూసెక్కుఉల, గుత్పా ఎత్తిపోతల పథకానికి 135 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు విడుదల అవుతుండగా 462 క్యూసెక్కుల నీరు ఆవిరి అవుతోంది. ఇదిలా ఉండగా జూన్ 1వ తేది నుంచి ఇప్పటివరకు ప్రాజెక్టులోకి 37.659 టీఎంసీల వరద నీరు వచ్చి చేరగా, 6.479 టీఎంసీల నీటిని వివిధ అవసరాల నిమిత్తం వ్యయం చేశారు.

వరద కాలువకు నీరు నిలిపివేత...

శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి వరద కాలువకు నీటి విడుదలను సోమవారం అధికారులు నిలిపివేశారు. మధ్యాహ్నం 1.15 గంటల నుంచి ఇందిరమ్మ వరద కాలువ హెడ్ రెగ్యులటరీ గేట్లు మూసి వేసి నీటి విడుదల నిలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వరద కాలువకు నీటి విడుదల నిలిపి వేసినట్లు ఎస్సారెస్పీ ప్రాజెక్టు అధికారులు ప్రకటించారు.



యువతా మేలుకో..



నేడు అంతర్జాతీయ యువజన దినోత్సవం

గణేశ్‌నగర్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): యువత అంటే వ్యక్తుల సమూహం కాదు... వనరులను సద్వినియోగం చేసుకుంటూ ప్రపంచాన్ని ముందుకు తీసుకెళ్లాలని చూసే మహత్తరమైన శక్తి. అలాంటి శక్తి, యుక్తుల సమహారంగా జరుపుకునేదే అంతర్జాతీయ యువజన దినోత్సవం. అంతర్జాతీయ యువజన దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం ఆగస్టు 12న ప్రపంచవ్యాప్తంగా జరుపుకుంటారు. ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో అంతర్జాతీయ యువజన వేడుకలను ప్రతి సంవత్సరం ఒక్కో దేశంలో నిర్వహిస్తుంటారు. సమాజానికి పౌరులకు సంబంధించిన ఒక (తీమ్) అంశంతో ఈ వేడుక నిర్వహిస్తారు.

- **నేపథ్యం**

1999వ సంవత్సరంలో ఐక్యరాజ్యసమితి చేసిన తీర్మానం ద్వారా మొదటి అంతర్జాతీయ యువజన దినోత్సవం ఆగస్టు 12, 2000న నిర్వ హించారు. అప్పటి నుంచి ఆగస్టు 12ను అంతర్జాతీయ యువజన దినోత్సవంగా ఐక్యరాజ్యసమితి ప్రకటించింది. ప్రతి సంవత్సరం ఆనవాయితీగా వస్తున్న ఈ వేడుక రజతోత్సవాన్ని ఈ యేడు కెన్యా దేశంలో నిర్వహిస్తున్నారు. ఈ వేడుకలో వివిధ దేశాలకు చెందిన లక్షలాదిమంది యువత పాలుపంచుకుంటుంది. అంతర్జాతీయ యువజన దినోత్సవాన్ని ఈసారి సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు- స్థానిక యువత చర్యలు థీమ్‌తో నిర్వహిస్తున్నారు.

- **అంతర్జాతీయ వేదికలపై జిల్లా వాసులు**

కరీంనగర్ జిల్లాలోని పలువురు యువజన సంఘాల ప్రతినిధులు జాతీయ స్థాయిలో ఉత్తమ యువజన వార్డులు అందుకోవడంతోపాటు అంతర్జాతీయ యువజన వేడుకల్లో పాల్గొన్నారు. గంగాధర మండలం కొండన్నపల్లి గ్రామానికి చెందిన నెహ్రూ యూత్ క్లబ్ అధ్యక్షుడు రేండ్ల కళింగ శేఖర్,షిప్ పర్ వరల్డ్ యూత్ సమ్మిట్‌లో పాల్గొన్నారు. కరీంనగర్‌కు చెందిన వివే కానంద యూత్ క్లబ్ అధ్యక్షుడు ఎ కిరణ్‌కుమార్ ఇండో- చైనా యూత్ ఎక్స్ఛేంజ్ ప్రోగాంతో పాటు మలేషియా, సింగపూర్‌లో నిర్వహించిన అంతర్జాతీ య యువజన- సాంస్కృతిక వేడుకల్లో పాల్గొన్నారు. రామడుగు మండలం గోపాలరావుపేటకు చెందిన సబర్మతి యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు అలువాల విష్ణు ఇండో- చైనా యూత్ ఎక్స్ఛేంజ్ వేదికలో భారతదేశ ప్రతినిధిగా పాల్గొన్నారు.

- **జిల్లాలో వేడుకల నిర్వహణ**

జిల్లాలోని యువత ప్రతి సంవత్సరం అంతర్జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా వేడుకలను నిర్వహిస్తుంది. అందుకు అనుగుణంగా అంతర్జాతీయ యువజన వేడుకల అంశాల వారీగా అవగాహన సదస్సులను, ఫొటో ప్రదర్శనల వంటి కార్యక్రమాలను నిర్వహిస్తారు.



జంక్ ఫుడ్ నుంచి యువత రక్షించుకోవాలి..

డాక్టర్ ఒల్లాల శ్రావణ్‌కుమార్, జనరల్ ఫిజిషియన్



యువత ఆరోగ్యంగా ఉంటేనే ఆ దేశ భవిష్యత్తు బాగుంటుంది. అంతర్జాతీయ యువజన దినోత్సవం జరుపుకుంటున్న ఈ తరుణంలో, భారతదేశంలోని యువత ఎదుర్కొంటున్న ఆరోగ్య సవాళ్లను పరిష్కరించడం చాలా ముఖ్యమైనది. నేటి యువతలో 56.4 శాతం వ్యాధులకు అనారోగ్యకరమైన జంక్ ఫుడ్ ప్రధాన కారణం. యువత ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి. జంక్ ఫుడ్‌ను తీసుకోవద్దు.

యువతకు ఆరోగ్య యోగా అవసరం..

ముత్యాల రమేష్, యోగా మాస్టర్

వేగంగా మారుతున్న నేటి యుగంలో యువత ఎంతో ఒత్తిడికి, ఆందోళన గురవుతున్నారు. యువత జీవన విధానంలో ఏర్పడే భావోద్వేగాలను సరి చేసుకోవడానికి ఆరోగ్య యోగ కచ్చితంగా అవసరం. ఈ తరం యూత్ ప్రతిరోజు కనీసం 30 నిమిషాలపాటు యోగాకు కేటాయిస్తే మంచి ఆరోగ్య ఫలితాలు అందుతాయి. యోగా ద్వారా యువతకు శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక స్థయిర్యాన్ని ఇస్తుంది.



రేపు బోధనోపకరణాల మేళా

ఓదెల, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో బుధవారం బోధనోపకరణాల మేళా నిర్వహించనున్నట్లు ఎంఈవో రమేష్ ప్రకటనలో తెలిపారు. మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో పని చేసే నలభై మంది ఉపాధ్యాయులు హాజరవుతారని పేర్కొన్నారు. ఉదయం 9 గంటల వరకు రిజిస్ట్రేషన్ చేయించుకొని, కేటాయించిన స్థలంలో ఉపకరణాలను ప్రదర్శనలో ఉంచాలని సూచించారు. ఎమ్మెల్యే విజయ రమణారావు, డీఈవో మాధవి, ఇతర శాఖల అధికారులు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు.

ధర్మారంలో సామాజిక తనిఖీ ప్రజావేదిక



ప్రజావేదిక నిర్వహిస్తున్న అధికారులు

ధర్మారం, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ సామాజిక తనిఖీలో ప్రజావేదికను సోమవారం ధర్మారంలో నిర్వహించారు. మండలంలోని 29 గ్రామ పంచాయతీల్లో చేసిన పనులను పరిశీలించేందుకు జూన్ 30 నుంచి ఈ నెల 10 వరకు గ్రామ సభలు నిర్వహించారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో పనుల వివరాలను వెల్లడించారు. ఏప్రిల్ నుంచి మార్చి వరకు చేపట్టిన రూ.9.82 కోట్ల పనుల రికార్డులను తనిఖీ చేశారు. ఈ ప్రజా వేదికలో 8500 రూపాయలు ఈజీఎస్ సిబ్బందిపై జరిమానా విధించినట్లు ఏపీడీ సత్యనారాయణ తెలిపారు. ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, డీవీఓ కొమురయ్య, ఎంపీఓ రమేష్, పీఆర్ ఏఈ రాజశేఖర్, జేక్యూసీ హరికృష్ణ, ఎస్ఆర్‌పీ బాలునాయక్ ఉన్నారు.

బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలి

పాలకుర్తి,ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి):రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని, రానున్నది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని వీహెచ్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు వ్యాళ్ల హరీష్‌రెడ్డి అన్నారు. సోమవారం కుక్కలగూడూర్ బీఆర్ఎస్ శ్రేణులు ఆయనకు ఘన స్వాగతం పలికి సన్మానించాయి. ఆయన మాట్లాడుతూ.. ప్రతీ కార్యకర్త పార్టీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని సూచించారు. మాజీ సర్పంచ్ గోంధ్ర చందర్, పార్టీ గ్రామ అధ్యక్షుడు కుదిరె సతీష్, ఉపాధ్యక్షుడు సట్ల ఏలియా, నాయకులు మేకల మొగిళి, ఆలేటి శంకరయ్య, మహేష్, గోంధ్ర విష్ణు, బండారి కార్తీక్, ముద్దసాని సాగర్ పాల్గొన్నారు.

యువకుడి రక్తదానం

సుల్తానాబాద్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఐతరాజుపల్లికి చెందిన మడ్డి సాయి కిషోర్ సోమవారం రక్తదానం చేశారు. ముత్తారం గ్రామానికి చెందిన లక్ష్మీకి రక్తం అవసరమవగా సాయి కిషోర్ కరీంనగర్‌లోని ప్రతిమ ఆసుపత్రి బ్లడ్ బ్యాంక్‌లో రక్తదానం చేసి మానవత్వాన్ని చాటుకున్నాడు. సాయి కిషోర్ మాట్లాడుతూ ఇప్పటిరకు 31వ సారి రక్తందానం చేసినట్లు చెప్పాడు.

మంచినీటి సరఫరా పునరుద్ధరణ

కాల్వశ్రీరాంపూర్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని జాఫర్‌ఖాన్‌పేటలో సోమవారం అధికారులు మంచినీటి సరఫరా పునరుద్ధరణ చర్యలు చేపట్టారు. గ్రామానికి మంచి నీరు ఇవ్వడం లేదని మాజీ వార్డుమెంబర్ తిప్పని శ్రావణ్ వాటర్ ట్యాంక్ ఎక్కి నిరసన తెలిపారు. దీంతో స్పందించిన మండల ప్రత్యేక అధికారి ఆరిఫ్ హుస్సేన్ సోమవారం గ్రామంలో పర్యటించారు. మంచినీటి సమస్యను తెలుసుకొని చర్యలు చేపట్టారు. కార్యదర్శి శంకర్, అధికారులు ఉన్నారు.

కరాటేతో విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం పెంపు


పోటీల్లో బెల్టులు పొందిన విద్యార్థులు

కాల్వశ్రీరాంపూర్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): కరాటేతో విద్యార్థుల్లో ఆత్మస్థయిర్యం పెరుగుతుందని మాజీ ఎంపీపీ గోపగాని సారయ్యగౌడ్ అన్నారు. మండల కేంద్రంలోని వేదవ్యాస ఉన్నత పాఠశాలలో సోమవారం ఆల్ ఇండియా దమ్మిక కాయ్ కరాటే ఫెడరేషన్ ఆధ్వర్యంలో కరాటే గ్రేడింగ్ టెస్ట్‌ని రాష్ట్ర స్టైల్ చీఫ్ ప్రసన్న కృష్ణ పర్యవేక్షణలో కల్వల రమేష్ అధ్యక్షతన నిర్వహించారు. 55 మందిని గ్రీన్‌బెల్ట్, ఐదుగురిని బ్రౌన్ బెల్టులకు అర్హులుగా ఎంపిక చేశారు. త్వరలో మలేషియాలో జరగనున్న అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనేలా విద్యార్థులను ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కరస్పాండెంట్ జూపాక ఉమామహేశ్వర్, గుర్రం దివాకర్, జూపాక సౌమ్య, ప్రిన్సిపాల్ సదయ్య పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా నాగరాజు



పెద్దపల్లి రూరల్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): పెద్దబొంకూర్ గ్రామానికి చెందిన కారుపాకల నాగరాజును జిల్లా బీసీ యువజన సంఘం ఉపాధ్యక్షుడిగా నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు పిట్టల రమేష్ పేర్కొన్నారు. సోమవారం నాగరాజుకు నియామక పత్రం అందించారు. నాగరాజు మాట్లాడుతూ బీసీల ఐక్యతకు కృషి చేస్తానన్నారు. నియామకానికి సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

పెరుకపల్లిలో ఉచిత వైద్య శిబిరం

ధర్మారం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): పల్లె ప్రజలకు వైద్య సేవలు అందించాలని వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు మెడికవర్ ఆసుపత్రి సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ కుమార్ తెలిపారు. సోమవారం పెరుకపల్లిలో వంద మందికి పైగా రోగులకు షుగర్, బీపీ, ఈసీజీ పరీక్షలు నిర్వహించి మందులను ఉచితంగా పంపిణీ చేశారు. గోపాల్, లింగయ్య, సతీష్, కమలాకర్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్న ఈసీ

యైటింక్లయిన్‌కాలనీ, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): ఎలక్షన్ కమిషన్ బీజేపీకి అనుకూలంగా వ్యవహరిస్తుందని యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఇరికి మహేష్ పేర్కొన్నారు. సోమవారం కాలనీలో ఓట్ల అవకతవకలపై ప్రచారం నిర్వహించారు.

మత్తు పదార్థాలను ప్రభుత్వం అరికట్టాలి

అంతర్గాం, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): గంజాయి, డ్రగ్స్, గుట్కా మత్తు పదార్థాల విక్రయాలను అరికట్టాలని సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా అనుబంధ ప్రగతి శీల యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు రమేష్ అన్నారు. మండల కేంద్రంలో నిరసన తెలిపారు. ఎస్ఐ వెంకటస్వామికి వినతి పత్రం అందజేశారు.

రైతు బీమాకు మార్గం సుగమం

(5వ పేజీ తరువాయి)

వరకు అమల్లో ఉంటున్నది. ధరణి పోర్టల్ ఆధారంగా బీమా పథకాన్ని రైతుల పేరిట రెన్యూవల్ చేశారు. కొత్తగా పట్టాదారు పాసు పుస్తకాలు పొందిన రైతులు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించారు.

2023లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతు బీమా పథకాన్ని కొనసాగిస్తూ వస్తున్నది. యేటా అర్హులైన రైతులకు వర్తింపజేసేందుకు రెన్యూవల్ చేయడం, కొత్తగా పట్టాదారు పాసు పుస్తకాలు పొందిన రైతులకు బీమా పథకాన్ని వర్తింపజేసేందుకు ఆగస్టు 5వ తేదీ నాటికి దరఖాస్తులు స్వీకరిస్తారు. ఈ ఏడాది నెల రోజులపాటు ఆలస్యం అయ్యింది. దరఖాస్తు చేసుకునేందుకు ఇంకా రెండు రోజుల గడువు మాత్రమే ఉంది. గతేడాది వరకు జిల్లాలో 1,01,435 మంది రైతులకు బీమా పథకాన్ని వర్తింప జేశారు. ఇందులో 60 ఏళ్లు దాటిన వారికి పథకం నుంచి తొలగించి మిగతా రైతుల పేరిట ప్రభుత్వం ప్రీమియం చెల్లించి రెన్యూవల్ చేయనున్నారు. ఈ పథకం 18-59 సంవత్సరాల వయస్సు ఉన్న వారికి వర్తించనున్నది. 1966 ఆగస్టు 14వ తేదీ నుంచి 2007 ఆగస్టు 13వ తేదీ వరకు పుట్టిన వాళ్లు పథకంలో చేరేందుకు అర్హత కలిగి ఉంటారని వ్యవసాయ శాఖాధికారులు తెలిపారు.

జిల్లాలో ఏఈఓలు కొత్త రైతుల నుంచి రైతువేదికల్లో సోమవారం నుంచి దరఖాస్తులను స్వీకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. రైతులు పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ జిరాక్స్, పట్టాదారు పాసు పుస్తకం జారీ కాకుంటే డిజిటల్ సైన్ గల తహసీల్దార్ జారీ చేసిన పట్టాదారు ఉత్తర్వు కాపీ తీసుక రావాలని, నామినీ, ఆధార్ కార్డు ప్రతులను వెంట తీసుకుని వెళ్లి ఏఈఓలను కలిస్తే ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. ఈ విషయమై జిల్లా వ్యవసాయ శాఖాధికారి బి శ్రీనివాస్ 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ రైతు బీమా పథకంలో అర్హులైన రైతులకు రెన్యూవల్ చేసేందుకు ప్రభుత్వం అనుమతించిందని, కొత్తగా పట్టాదారు పాసుపుస్తకాలు పొందిన రైతుల దరఖాస్తులను స్వీకరించి ఏఓలు, ఏఈఓలు రైతువేదికల్లో ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. గతంలో నమోదు కాకుండా 5 ఎకరాల లోపు ఉన్న 1007 మంది రైతులకు, 5 ఎకరాలకు పైబడి ఉన్న 46 మంది రైతులకు కూడా బీమా పథకం వర్తిస్తుందని, వారంతా దరఖాస్తు చేసుకోవాలని, గతంలో ఐడీ వస్తే మాత్రం రెన్యూవల్ అవుతుందని తెలిపారు.

రామగిరి, (ఆంధ్రజ్యోతి): పట్టాదారు పాస్‌బుక్కులు పొందిన రైతులకు మండలంలోని రైతు వేదికలో ఏవో చిందం శ్రీకాంత్ దరఖాస్తులను స్వీకరించారు. పటాదారు పాస్‌పుస్తకం, ఆధార్‌కార్డు, నామినీ ఆధార్‌కార్డుతో దరఖాస్తు ఫారాన్ని సమర్పించాలన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సుల్తానాబాద్, (ఆంధ్రజ్యోతి): రైతు బీమా లబ్ధి పొందడానికి అర్హులైన రైతులు రైతువేదికలలో దరఖాస్తులను సమర్పించారు. గతంలో ఈ పథకం కింద లబ్ధి పొందుతున్న రైతులు తమ వివరాలను ఈనెల 12లోగా సరి చేసుకోవాలన్నారు. అలాగే కొత్తగా ఈనెల 14 నుంచి కొత్త వారికి పథకం వర్తింపచేస్తారని ఏఈఓలు సౌమ్య, పద్మ, రవితేజ, ప్రశాంత్, స్వప్న తెలిపారు.

కనీస విద్యా ప్రమాణాలు అందేలా కృషి చేయాలి

మంథనిరూరల్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థికి కనీస విద్యా ప్రమాణాలు అందే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. మండలంలోని చిల్లపల్లి యూపీఎస్‌ను సోమవారం కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో 7వ తరగతి విద్యార్థుల ఇంగ్లీష్ రీడింగ్ స్కిల్స్‌ను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. పిల్లలకు చదవడం, రాయడం వంటి ప్రాథమిక విద్యా ప్రమాణాల పెంపు పై దృష్టి సారించాలన్నారు. విద్యార్థులకు చదవడం తోపాటు చదివింది అర్థం చేసుకోవడం రావాలని, ఆ దిశగా టీచర్లు బోధన చేయాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి పిల్లలకు నాణ్యమైన ఆహారం అందించాలని ఆదేశించారు.

చింత చెట్టుకు పారుతున్న కల్లు



జూలపల్లి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ వెళ్ళే రహదారి చౌరస్తాలో చింత చెట్టుకు కల్లు పారుతోంది. రెండు రోజులుగా వస్తున్నా సోమవారం ప్రజలు గమనించారు. గతంలో వేపచెట్టుకు కల్లుపారడం చూసామని ఇలా చింతచెట్టు కల్లు పారడం ఇప్పుడే చూస్తున్నామని ప్రజలు తెలిపారు.

భూ ఆక్రమణపై ఫిర్యాదు

ఓదెల, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): పొత్కపల్లి గ్రామపంచాయతీకి చెందిన 666 సర్వే నెంబర్‌లో భూమి ఆక్రమణపై సోమవారం గ్రామానికి చెందిన శనిగరపు రమేష్ కలెక్టర్ కోయ శ్రీహర్షకు ఫిర్యాదు చేశారు. పొత్కపల్లి ప్రధాన రోడ్డు పక్కన ఉన్న విలువైన ప్రభుత్వ భూమి దాదాపు ఎకరం వరకు కొందరు ఆక్రమించారని, ఎవరు పట్టించుకోకపోవడంతో నిర్మాణాలు చేపట్టారని తెలిపారు. భూమిని సర్వే చేయించి, ఆక్రమణకు గురైన భూమిని కాపాడాలని కోరారు. భవిష్యత్ తరాలకు భూమిని వినియోగించి, భూమి చుట్టూ కంచెను ఏర్పాటు చేయాలని కోరారు.

అందుబాటులో యూరియా

ఓదెల, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): పొత్కపల్లి ప్యాక్స్ ఎరువుల కేంద్రంలో రైతులకు అందుబాటులో యూరియా నిల్వలు ఉన్నాయని ఏవో భాస్కర్ తెలిపారు. సోమవారం ఎరువుల కేంద్రంలో ఏవో భాస్కర్, ఏఈవోలు తనిఖీలు నిర్వహించి రికార్డులను పరిశీలించారు. కేంద్రంలో వెయ్యి యూరియా బస్తాలు నిల్వ ఉన్నాయని, ప్యాక్స్, డిసిఎంఎస్, ఆగ్రోస్ కేంద్రాలతోపాటు ప్రయివేటు ఎరువుల దుకాణాలకు యూరియా బస్తాలు వస్తున్నాయని అన్నారు. రైతులకు అవసరమైన మేరకు సరిపడు బస్తాలు వస్తున్నాయని, రైతులకు అవసరమైన మేరకే యూరియా వినియోగించాలని, రైతులు ఆందోళన చెందాల్సిన పనిలేదని తెలిపారు. యూరియా కృత్రిమ కొరత సృష్టిస్తే కారకులైన ఎరువుల డీలర్లపై చర్యలు తీసుకుంటామని, అలాగే లైసెన్సులు కూడా రద్దు చేస్తామని అన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే జరిమానా


సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ అరుణశ్రీ

కోల్‌సిటీ, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో బహిరంగ ప్రదేశాలు, రోడ్లు, కాలువల్లో చెత్త వేస్తే జరిమానా విధించాలని కార్పొరేషన్ కమిషనర్ అరుణశ్రీ పారిశుధ్య సిబ్బందిని ఆదేశించారు. సోమవారం కార్పొరేషన్ శానిటేషన్, మంచినీటి సరఫరా, మెప్మా సిబ్బందితో సమావేశం నిర్వహించారు. పారిశుధ్యాన్ని మెరుగుపరచాలని, ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్త వేర్వేగా సేకరించేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. మురుగునీటి కాలువల్లో పూడిక తీత, స్ప్రే, ఫాగింగ్, ఆయిల్ బాల్స్ వేయడం షెడ్యూల్ ప్రకారం జరుగాలన్నారు. ప్రతి స్వచ్ఛ ఆటో రెండు సార్లు డంపింగ్ యార్డుకు వెళ్లి చెత్త డంపింగ్ చేసేలా చూడాలన్నారు. పారిశుధ్య, ఆరోగ్యశాఖ సిబ్బందిని సమన్వయం చేసుకోవాలని, జ్వరాలు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలన్నారు. మంచినీటి పైప్‌లైన్ లీకేజీలను గుర్తించి మరమ్మతు చేయాలని, రోజు నిర్ణీత వేళల్లో నీటి సరఫరా చేయాలన్నారు. 18సంవత్సరాలు నిండిన నిరుపేద మహిళలను గుర్తించి కొత్తగా స్వశక్తి సంఘాలు ఏర్పాటు చేయాలని, వన మహోత్సవాన్ని విజయవంతం చేయాలన్నారు. ఇంటి పన్నులు, లైసెన్స్ రుసుం వసూలుపై దృష్టి పెట్టాలన్నారు. డీసీ వెంకటస్వామి, ఈఈ రామన్ ఉన్నారు.

రోగులతో కిక్కిరిసిన ఖని పభుత్వాసుపత్రి


ఆసుపత్రి ఓపీ కౌంటర్ వద్ద రోగులు, బంధువులు

కళ్యాణ్‌నగర్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సోమవారం రోగులతో కిక్కిరిసింది. విష జ్వరాలు విజృంభిస్తుండడంతో కొత్త, పాత బిల్డింగ్‌లలోని ఓపీ కౌంటర్ల వద్ద రోగులు భారీగా క్యూ కట్టారు. సోమవారం 1300మంది రోగులు రాగా అందులో ఎక్కువగా వైరల్ ఫీవర్, మలేరియా, టైఫాయిడ్, దగ్గు, జలుబుతో బాధపడుతున్నారు.

ఆసుపత్రిలో ఆందోళనకు దిగిన రోగులు

పాత భవనంలో ఓపీ కేంద్రాల వద్ద ఫ్యాన్లు లేక పోవడంతో ఇబ్బందులు పడుతున్నామని, ఫార్మాసిస్టుల కోసం గంటల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని రోగులు ఆరోపించారు. ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరవుతున్నా సిబ్బంది పట్టించుకోవడం లేదని, గంటల తరబడి క్యూలో నిలబడాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సెక్యూరిటీ సిబ్బంది వారించినా రోగులు వినలేదు. ఓపీ కౌంటర్ వద్ద ఫ్యాన్లు ఏర్పాటు చేయడంలో ఆసుపత్రి సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై మండిపడ్డారు.

విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ


కస్తూర్బాలో పిల్లలకు మాత్రలు వేస్తున్న సిబ్బంది

కాల్వశ్రీరాంపూర్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంతోపాటు గ్రామాల్లో వైద్య సిబ్బంది పాఠశాలల్లోని విద్యార్థులకు, అంగన్‌వాడీలోని చిన్నారులకు నట్టల నివారణ మందులను వేశారు. మధ్యాహ్న భోజనం అనంతరం మండల కేంద్రంలోని ఆయా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలతోపాటు అంగన్‌వాడీ సెంటర్లు, కస్తూర్బా, మోడల్ స్కూల్ విద్యార్థులు 1 నుంచి 19 ఏళ్ల లోపు వారికి అందించినట్లు వైద్యుడు శ్రీనివాస్ తెలిపారు. హెల్త్ సూపర్‌వైజర్లు నీరజ, సరోజన, ఏఎన్ఎంలు సరోజన, సునీత, పద్మ, సరిత, సుధారాణి, శైలజ, విజయ, కవిత, శోభతోపాటు తదితరులు పాల్గొన్నారు.

కమాన్‌పూర్, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఆపిల్ కిడ్స్ పాఠశాలలో విద్యార్థులకు నులిపురుగు నివారణ మాత్రలను పంపిణీ చేశారు. ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది విద్యార్థులకు మందులను వేశారు. అల్బెండోజెల్ మాత్రలతో నులిపురుగులు, నట్టలు నివారణ అవుతాయని తెలిపారు. చేతులు శుభ్రంగా కడుక్కోవాలని తెలిపారు. ప్రిన్సిపాల్ రాజమణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మంథనిరూరల్, (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కాకతీయ హైస్కూల్ తోపాటు ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు గద్దలపల్లి ప్రాథమిక వైద్య సిబ్బంది నులి పురుగుల నివారణ మాత్రలను పంపిణీ చేశారు. మండలంలో 15,477 మంది విద్యార్థులకు మాత్రలు పంపిణీ చేసినట్లు డాక్టరు సృజన్‌తెలిపారు.

ఓదెల, (ఆంధ్రజ్యోతి) : నులిపురుగులను నివారిస్తేనే విద్యార్థుల్లో ఎదుగుదల ఉంటుందని వైద్యాధికారి సంజ నీష్ తెలిపారు. కొలనూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలనువేశారు. హెచ్ఎం ఏసుదాసు, హెచ్ఇఓ శ్రీనివాస్, ఏఎన్ఎం కిషోర్ నిర్మల, ఉపాధ్యాయులు, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

పెద్దపల్లి రూరల్, (ఆంధ్రజ్యోతి): పిల్లల్లో రక్తహీనత నివారణకు ఆల్బెండజోల్ నివారణ మాత్రలు వాడాలని వైద్యులు వాణిశ్రీ అన్నారు. రాగినేడు ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు మాత్రలను పంపిణీ చేశారు. వైద్యులు శ్రావణ్‌కుమార్, సిబ్బంది, పాల్గొన్నారు.

ముత్తారం, (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. చేతులను శుభ్రంగా ఉంచుకోవాలని, శుభ్రమైన నీరు తాగాలని, వేడి ఆహర పదార్థాలు తీసుకోవాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని వారు సూచించారు.

ఎలిగేడు,(ఆంధ్రజ్యోతి): పిల్లల్లో నులి పురుగుల నివారణకు దృష్టి సారించాలని జిల్లా డిప్యూటీ వైద్యాధికారి శ్రీరాములు తెలిపారు. పలు గ్రామాల్లో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను అందించారు. మండలంలో 3378 మంది బాలబాలికలు ఉన్నారని, వారిలో 2309 మందికి అందించినట్లు తెలిపారు. మిగతా వారికి ఈ నెల 18న మాత్రలు వేయనున్నట్లు పేర్కొన్నారు. మండల వైద్యాధికారి నిస్సి క్రిస్టినా, ఎంఎల్‌హెచ్‌పీలు సింధూర, ఎంపీఓ కిరణ్, సూపర్‌వైజర్లు లక్ష్మణ్, నాగమణి, వినయా, పాల్గొన్నారు.

కోల్‌సిటీటౌన్, (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం నిర్వహించారు. కళాశాల జంతుశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జైకిషన్ ఓజా మాట్లాడారు. అనంతరం విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలను పంపిణీ చేశారు. జంతుశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ కిరణ్మయి మాట్లాడుతూ నులిపురుగులు, నట్టల నివారణకు ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తుందని, అవగాహన కలిగి ఉండాలన్నారు. వృక్షశాస్త్ర విభాగ అధిపతి సవిత, డాక్టర్ శారద, ప్రత్యూష, విద్యార్థులు పాల్గొన్నారు.


రాగినేడు పాఠశాలలో విద్యార్థులకు మాత్రలు వేస్తున్న వైద్యులు



అంకితభావంతో విధులు నిర్వహించాలి


మల్టీ డిపార్టమెంట్ సమావేశంలో పాల్గొన్న ఏపీఏ జీఎం

రామగిరి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): అంకితభావంతో విధులు నిర్వహించాలని ఏపీఏ జీఎం నాగేశ్వర్‌రావు అధికారులకు సూచించారు. సోమవారం కార్యాలయంలో మల్టీడిపార్టమెంటల్ సమావేశాన్ని నిర్వహించారు. ఉద్యోగులు సమయపాలన పాటిస్తూ, విధుల్లో అంకితభావంతో పనిచేయాలన్నారు. ఉద్యోగులకు సంస్థ అనేక సంక్షేమ కార్యక్రమాలను నిర్వహిస్తుందనే విషయాన్ని గుర్తించాలని పేర్కొన్నారు. ఆర్జీ-3 ఇంచార్జి జీఎం వెంకటరమణ, అధికారులు శేఖరబాబు, యాదయ్య, రామ్మోహన్, బండి సత్యనారాయణ, రాజశేఖర్, ప్రవీణ్, ఫాంటింగ్, చంద్రశేఖర్, చంద్రశేఖర్, భానుప్రసాద్‌రావు, కాశీ విశ్వేశ్వరరావు, సుదర్శనం, రాజేంద్రకుమార్ పాల్గొన్నారు.

స్వాతంత్ర్య వేడుకల నిర్వహణపై సమీక్ష

యైటింక్లయిన్‌కాలనీ, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): ఆర్జీ-2 డివిజన్‌లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నిర్వహణపై వివిధ విభాగాల అధికారులతో సోమవారం జీఎం బండి వెంకటయ్య సమావేశం నిర్వహించారు. స్వాతంత్ర్య వేడుకలను కమ్యూనిటీహాల్‌లో నిర్వహించేలా అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. వేడుకల్లో అధికారులు, ఉద్యోగులు వారి కుటుంబాలు, కాలనీ ప్రజలు భాగస్వాములయ్యేలా ప్రచారం నిర్వహించాలని అధికారులకు జీఎం సూచించారు. అధికారులు ఏ నెహ్రూ, ఉదయ్‌హరిజన్, సృజన్‌మెహ్రా, అరవిందరావు, మురళీకృష్ణ, ధనుంజయ, వెంకటరామ చంద్ర, రాంరెడ్డి, రవికిరణ్‌లు పాల్గొన్నారు.

సివిల్స్ మెయిన్స్‌కు ఎంపికైన అభ్యర్థులకు ఆర్థికసాయం


సివిల్స్ అభ్యర్థులకు చెక్కు అందజేస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు, సీఎండీ

గోదావరిఖని, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): సివిల్స్‌లో తెలంగాణ నుంచి అత్యధిక సంఖ్యలో అభ్యర్థులు ఎంపికవ్వాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. సోమవారం హైదరాబాద్ ప్రజాభవన్‌లో సింగరేణి ఆధ్వర్యంలో మెయిన్స్‌కు ఎంపికైన 180మందికి ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున ఆర్థిక సహాయం అందించే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం సివిల్స్‌కు సిద్ధమవుతున్న అభ్యర్థులకు కొంత సాయం చేస్తే వారు లక్ష్యం సాధించేందుకు ఉపయోగపడుతుందని ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. సివిల్స్ సాధించేందుకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు అన్ని విధాలుగా సహకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. మెయిన్స్‌కు ఎంపికైన ఒక్కొక్కరికి లక్ష చొప్పున, ఇంటర్వ్యూకు ఎంపికైన వారికి కూడా లక్ష ఆర్థిక సాయం, ఢిల్లీలో వసతులు కల్పిస్తామని భరోసా ఇచ్చారు. మొదటి సంవత్సరం 148మందికి ఆర్థిక సహాయం అందించగా పదిమంది సివిల్‌కు ఎంపికయ్యారని వివరించారు. ప్రజల జీవన స్థితిగతులు మార్చడానికి సివిల్ సర్వీసెస్ ద్వారా అవకాశముంటుందని, వేలాది మంది రాష్ట్రంలో పనిచేసినా ఎస్ఆర్ శంకరన్, పార్థసారథి, మాధవరావు వంటి కొద్ది మంది పేర్లు మాత్రమే జనం గుండెల్లో నిలిచిపోయారన్నారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు తీసుకువచ్చే సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు పూర్తి స్థాయిలో ప్రజలకు చేరవేస్తేనే ప్రభుత్వాలు ఆశించిన లక్ష్యాలు నెరవేరుతాయన్నారు. అధికారుల్లో చిత్తశుద్ధి లోపిస్తే ప్రభుత్వ లక్ష్యాలు ఎంత గొప్పగా ఉన్నా ఫలితం ఉండదన్నారు. ఎస్ఆర్ శంకరన్ సాంఘిక సంక్షేమ శాఖలో సెక్రటరీగా ఉన్నప్పుడు చేపట్టిన కార్యక్రమాలు ప్రజల జీవన స్థితిగతులు మార్చడానికి ఉపయోగపడ్డాయన్నారు. 45వేలకు పైబడి ఉన్న సింగరేణి కార్మికులు సింగరేణి సంస్థను బతికిస్తూ పరోక్షంగా లక్షలాది మందికి ఉపాధి కల్పిస్తున్నారని డిప్యూటీ సీఎం తెలిపారు. మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొన్నం ప్రభాకర్, ఇంధన శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్, సింగరేణి సీఎండీ ఎన్ బలరామ్, ఎమ్మెల్యేలు గడ్డం వినోద్, గండ్ర సత్యనారాయణ, మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, కనీస వేతనాల అమలు కమిటీ ఛైర్మన్ జనక్‌ప్రసాద్, సింగరేణి డైరెక్టర్లు పాల్గొన్నారు.

సింగరేణి కార్మికులను పదేళ్లు మోసం చేసిన కవిత

గోదావరిఖని, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): పది సంవత్సరాలు అధికారంలో ఉండి, సింగరేణి గుర్తింపు సంఘం గౌరవ అధ్యక్షురాలిగా వ్యవహరించిన కవిత, సింగరేణి కార్మికులను మోసం చేసిందని ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ బీ జనక్ ప్రసాద్ ఒక ప్రకటనలో ఆరోపించారు. ఇంట్లో పంచాయితీ పెట్టుకుని హెచ్ఎంఎస్‌తో పొత్తు అంటూ ప్రెస్ మీట్ పెట్టి కల్లబొల్లి మాటలు చెబితే కార్మికులు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. సంవత్సరానికి 5 కొత్త బొగ్గు గనులు ఓపెన్ చేస్తామన్న కవిత 10ఏళ్లలో ఒక్క గని కూడా ఎందుకు తెరవలేదని ప్రశ్నించారు. సొంత ఇంటి కల, పెర్క్స్, ఇన్‌కంటాక్స్ రద్దు అధికారంలో ఉన్నప్పుడు ఎందుకు నెరవేర్చలేదన్నారు. గత 10ఏళ్లలో సింగరేణి నిధుల నుండి కార్మికుల 30వేల కోట్లు దుర్వినియోగం చేసి, ఎమ్మెల్యే, మంత్రులకు 2కోట్ల చొప్పున పంచింది టీబీజీకేఎస్, బీఆర్ఎస్ కాదా అన్నారు. పదేళ్ల గుర్తింపు సంఘంగా ఉన్న టీబీజీకేఎస్, చివరి ఎన్నికల్లో పోటీ కూడా చేయలేని స్థితికి చేరిందంటే అవినీతి ఎంత దారుణమో కార్మికులకు తెలుసన్నారు. 22వేల కాంట్రాక్ట్ కార్మికులు ఉన్నారని కవిత చెబుతున్నదని, కానీ అసెంబ్లీలో ఒక్క కాంట్రాక్ట్ కార్మికుడు కూడా లేడని కేసీఆర్ చెప్పిన మాట మర్చిపోయారా అని ప్రశ్నించారు. మొన్నటికి దాకా కేసీఆర్, కవితపై తీవ్ర విమర్శలు చేసిన రియాజ్ ఇప్పుడు కవిత కాళ్ల దగ్గర హెచ్ఎంఎస్‌ను తాకట్టు పెట్టడం కార్మికుల గౌరవానికి అవమానమన్నారు.

రామగిరి, (ఆంధ్రజ్యోతి): కవిత సింగరేణి సంస్థను దోచి దాచుకుందని ఐఎన్‌టీయుసీ సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ ధర్మపురి ఆరోపించారు. కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సింగరేణిలో తిరిగి పాగా వేయడానికి హెచ్ఎంఎస్‌తో పొత్తును తెరపైకి తెస్తూ విశ్వప్రయత్నాలు చేస్తుందని విమర్శించారు. బీఆర్ఎస్ హయంలో అవినీతి కారణంగా కోల్‌బెల్ట్ ప్రాంతంలోని ఎమ్మెల్యేలు ఓటమి పాలయ్యారని విమర్శించారు. ఆర్జీ-3 ఉపాధ్యక్షుడు కొటరవీందర్‌రెడ్డి, నాయకులు వడ్డేపల్లిదాస్, శ్రీను, ఎల్లంకి రామారావు, మడ్డిరాజ్‌కుమార్, రామిండ్ల మనోహర్, గునిగంటి వెంకటస్వామి, సర్వన్, పాల్గొన్నారు.

సింగరేణి పరిస్థితులు తెలిపేందుకే సమావేశాలు

యైటింక్లయిన్‌కాలనీ, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): సింగరేణి స్థితిగతులు, ఎదురవుతున్న సవాళ్ళను ఉద్యోగులకు తెలియజెప్పేందుకు ఏరియా పరిధిలో మల్టీడిపార్ట్‌మెంట్ సమావేశాలు నిర్వహించనున్నట్లు ఆర్జీ-2 జీఎం బండి వెంకటయ్య తెలిపారు. సోమవారం జీఎం ఆఫీస్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉత్పత్తి వ్యయం పెరిగి బొగ్గు ధరలు పెరగడంతో వినియోగదారులు ఇతర సంస్థల బొగ్గు కొనుగోలుకు మొగ్గు చూపుతున్నారని, రానున్న రోజుల్లో ఇది సంస్థకు పెనుసవాల్‌గా నిలవనున్నట్లు పేర్కొన్నారు. నాణ్యమైన బొగ్గును వినియోగదారులకు అందించడం ద్వారా మార్కెట్‌లో సింగరేణి ఉనికి కాపాడుకోవాల్సిన అవసరం ఉన్నట్లు జీఎం తెలిపారు. ప్రతి ఉద్యోగి పని వేళలను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవడం, యంత్రాల వినియోగాన్ని పెంచాల్సిన అవసరం ఉన్నట్లు వెంకటయ్య తెలిపారు. సంస్థకు ఎదురవుతున్న సవాళ్ళను అధిగమించేందుకు ఉద్యోగుల నుంచి సూచనలు, సలహాలు తీసుకోనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈనెల 16 వరకు ఏరియా పరిధిలోని గనులు, ఓసీపీ, డిపార్ట్‌మెంట్‌ల వారీగా సమావేశాలు జరపనున్నట్లు జీఎం తెలిపారు అధికారులు నెహ్రూ, సృజన్‌మెహ్రా, అరవిందరావు, మురళీకృష్ణ, ధనుంజయ్, రాంరెడ్డి, షరీఫ్ మహమ్మద్, రవికిరణ్, సాధన్ పాల్గొన్నారు. మల్టీడిపార్ట్‌మెంట్ సమావేశాల నిర్వహణపై జీఎం వెంకటయ్య ఆర్జీ-2 ముఖ్య అధికారులు, గుర్తింపు సంఘం ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. నాయకులు శ్యాంసన్, సాంబశివరావు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.